Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 140 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 9 - 12 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## వందేమాతర గీతం దేశం ముక్కలు కాకుండా కాపాడింది.. లోక్‌సభలో మోదీ



**న్యూఢిల్లీ:** వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవాలపై సోమవారం లోక్‌సభలో చర్చ జరిగింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ వందేమాతరంపై లోక్‌సభలో మాట్లాడారు. వందేమాతరంపై చర్చలో పాల్గొ న్నందుకు గర్వపడుతున్నానని అన్నారు. జాతీయ గేయం 150 ఏళ్లు పూర్తి చేసుకుందని, స్వాతంత్ర్య పోరాటంలో భారతీయుల గొంతుక అయిన వందేమాతర గీతం ఎన్నో తరాలకు స్ఫూర్తినిచ్చిందని అన్నారు. వందేమాతరం ఉద్దేశాన్ని, గౌరవాన్ని మళ్లీ తీసుకు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. 2047 వికసిత్ భారత్ నెరవేరాలంటే వందేమాతరం స్ఫూర్తి అవసరమన్నారు. బంకించంద్ర చటర్జీ రాసిన వందేమాతరం దేశానికి పునరుజ్జీవాన్నిచ్చిందని చెప్పారు. గాడ్ సేవ్ ద క్వీన్ గీతానికి పోటీగా వందేమాతరం గర్వంగా నిలబడిందని అన్నారు. భారత మాతను దుర్గామాతగా కొలుస్తూ బంకించంద్ర అద్భుతంగా ఆ పాటను రాశారని తెలిపారు. వందేమాతరం.. ఆజాద్ భారత్‌కు విజన్‌గా మారిందని వెల్లడించారు. వందేమాతర గేయం శత్రువుల చెవుల్లో మారుమోగిందని అన్నారు. జననీ జన్మభూమిశ్చ అన్న రాముడి మాటలకు మరో రూపం వందేమాతరం అంటూ భావోద్వేగానికి గురయ్యారు. జ్ఞానం, సమృద్ధికి భారత్ మారుపేరని ప్రధాని మోదీ అన్నారు.

**భారత్ ముక్కలు కాకుండా కాపాడింది**

బ్రిటిష్ పరిపాలన కాలంనాటి పరిస్థితుల గురించి, అప్పటి ప్రజలపై వందేమాతర గీతం ప్రభావం గురించి మోదీ ప్రత్యేకంగా చెప్పారు. ఆయన మాట్లాడుతూ... 'దేశాన్ని ముక్కలు చేయాలని బ్రిటిషర్లు ప్రయత్నించారు. భారత్ ముక్కలు కాకుండా వందేమాతర నినాదం సాయం చేసింది. బెంగాల్ ఐక్యతకు వందేమాతర గేయం పాత్ర ఎనలేనిది. వందేమాతర నినాదం పలకకూడదని నిషేధం విధించారు. నిషేధం, ఆజ్ఞలు పట్టించుకోకుండా ప్రజలు పోరాటం చేశారు. వందేమాతర నినాదాలు వినలేక బ్రిటిషర్లు దారుణాలకు పాల్పడ్డారు. దేశంలో అనేక చోట్ల ఉద్యమకారులను కఠినంగా అణచి వేశారు' అని అన్నారు.

## కరెంట్ ఛార్జీలపై సీఎం చంద్రబాబు గుడ్‌న్యూస్



**అమరావతి, (రాజధాని వార్తలు):** విధ్వంసమైన ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను మళ్లీ గాడిలో పెడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ అనేక విజయాలను చవిచూసిందని.. కానీ 2024 విజయం..నమ్మకం, విశ్వాసం మీద వచ్చిందని తెలిపారు. సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామన్నారు. పరీక్ష రాసినప్పుడు పిల్లలు ఎంత టెన్షన్‌గా ఉంటారో తాము అంతే టెన్షన్‌గా ఉంటామని చెప్పుకొచ్చారు. జీఎస్డీపీ విషయంలో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటున్నామని తెలిపారు. ఈ రాష్ట్రాన్ని తిరిగి నిలబెట్టగలుగుతారా? అనే అనుమానాలు ప్రజల్లో ఉన్నాయని.. అయితే సిట్యూయేషన్ చూసి పారిపోమని ప్రజలకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. నాడు సూపర్ సిక్స్ తీసుకు వచ్చామని... అయితే అభివృద్ధికి నిధులు లేవన్నారు. క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్ బాగా తగ్గి అభివృద్ధి లేకుండా పోయిందని వెల్లడించారు. తరువాత అన్ని వ్యవస్థలను గాడిన పెట్టామన్నారు. క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్‌ను బాగా పెంచామని.. సుపరి పాలనకు టెక్నాలజీని అభివృద్ధి చేశామని అన్నారు. ఆగిపోయిన స్కీంలు అన్నింటినీ తిరిగి ప్రారంభించామని ముఖ్యమంత్రి చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమపాళ్లలో చేపట్టామన్నారు. 18 నెలలుగా ప్రతి గంట, ప్రతి క్షణం కష్టపడ్డామన్నారు. 93 స్కీంలను మరలా రివైవ్ చేసినట్లు తెలిపారు. రూ.9000 కోట్ల సోలార్ విండ్ రెన్యూవబుల్ ఎనర్జీ కింద నాటి ప్రభుత్వం డబ్బులు పెంచేసిందని విమర్శించారు. కరెంటు ఛార్జీలు పెంచకుండా వ్యవస్థను నిలబెట్టామన్నారు. కరెంటు ఛార్జీలు ఈ ఏడాది కూడా పెంచమని... వచ్చే ఏడాది పెంచుకుంటామని సీఎం వెల్లడించారు. రాష్ట్రంలో చాలా చోట్ల గ్రౌండ్ వాటర్ పెంచగలిగామన్నారు. ఏపీ బ్రాండ్ రాష్ట్రంలో పూర్తిగా దెబ్బతిన్నదని.. పరిశ్రమలను వెళ్లగొట్టారని మండిపడ్డారు. విద్యా వ్యవస్థలో ఆంగ్ల మీడియం అని చెప్పి డ్రాపవుట్లను పెంచారన్నారు. ఆలిండియా లెవల్‌లో టాప్ ఫైవ్ ఉన్న ఎడ్యుకేషన్ సిస్టంను టాప్ త్రీ లేదా వన్‌కు తీసుకువస్తామని స్పష్టం చేశారు. భూగర్భ జలాలను పెంచడం కూడా చేశామన్నారు. ఇటీవల జరిగిన ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పెట్టుబడుల గురించి అందరికీ తెలిసిందన్నారు. జీఎస్డీపీ, తలసరి ఆదాయం ఎలా పెరిగిందో చూస్తే రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ గాడిలో పడుతోందని అర్థమవుతోందన్నారు. ప్రజలకు ఈ విషయాలన్నీ తెలియాలనే ఉద్దేశంతో అన్నీ చేస్తున్నామన్నారు. రాష్ట్ర విభజన తరువాత టీడీపీ అయిదేళ్లు అధికారంలో ఉందన్నారు. ఇక్కడ సరాసరి జీఎస్టీ 13.5 శాతం సాధించామని... కేంద్ర జీఎస్డీపీ కన్నా ఎక్కువ సాధించామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక 12.02 శాతం వృద్ధి సాధించామని....ఆల్ ఇండియా లెవల్‌లో 9.8 శాతంగా ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కాగా.. 2025-26 తొలి అర్థ సంవత్సరం (ఏప్రిల్ నుంచి సెప్టెంబర్)... అలాగే 2వ త్రైమాసికం (జూలై నుంచి సెప్టెంబర్) ఫలితాలను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. స్థిర ధరల వద్ద నమోదైన ఆర్థిక వృద్ధి, రాష్ట్ర స్థూల ఉత్పత్తి, గ్రాస్ వాల్యూ అడిషన్, వ్యవసాయం, ఉత్పత్తి, సేవా రంగాలు నమోదు చేసిన వృద్ధి గణాంకాలను విడుదల చేశారు. విభజన వల్ల రాష్ట్రానికి వ్యవస్థీకృతమైన నష్టం జరిగిందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. 2019-24 పాలన వల్ల వ్యవస్థలు డీఫంక్ట్ అయ్యాయని...రాష్ట్రం అప్పుల్లో కూరుకు పోయిందని తెలిపారు. గత పాలకుల విధ్వంస పాలన వల్ల గ్రోత్ రేట్ తగ్గి రూ.7లక్షల కోట్ల జీఎస్డీపీ కోల్పోయామని వెల్లడించారు. గ్రోత్ రేట్ లేకపోవటం వల్ల రూ. 76,195 కోట్ల ఆదాయం కోల్పోయామన్నారు. గత ప్రభుత్వంలో ఎక్కువ వడ్డీలకు అప్పులు తేవటం వల్ల ప్రజాధనానికి నష్టం కలుగుతోందని చెప్పారు. రుణాల రీ-షెడ్యూలింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. బ్రాండ్ తగ్గిన ప్పుడు వడ్డీ రేటు పెరిగిపోతుందని... తద్వారా రెవెన్యూ జీఎస్డీపీలో రాష్ట్రం చాలా నష్టపోయిందని చెప్పుకొచ్చారు. 25 ఏళ్ల క్రితం చేసిన ఐటీ పాలసీ వల్ల తెలుగు వాళ్ల తలసరి ఆదాయం గరిష్ట స్థాయిలో ఉందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు ఎలా పెంచాలన్నదే ఎప్పుడూ తన ఆలోచన అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన షెడ్యూల్ ఖరారు.. పూర్తి వివరాలివే..



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. వచ్చే ఏడాది జనవరి 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు దావోస్‌లో ముఖ్యమంత్రి పర్యటించనున్నారు. దావోస్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు సీఎం చంద్రబాబు హాజరు కానున్నారు. చంద్రబాబు బృం దంలో మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ ఉన్నారు. ఈ మేరకు సీఎం దావోస్ పర్యటన షెడ్యూల్‌ను ఖరారు చేశారు అధికార వర్గాలు. సోమవారం దావోస్ పర్యటనకు సంబంధించిన ప్రకటన విడుదల చేశారు. అయితే దావోస్ పర్యటనలో పలువురు పారిశ్రా మికవేత్తలను కూడా సీఎం కలిసే అవకాశాలు ఉన్నాయి. ఏపీకి కావాల్సిన పెట్టుబడులపై పారిశ్రామిక వేత్తలతో చంద్రబాబు చర్చిం చే ఛాన్స్ ఉంది. ఏపీ అభివృద్ధిపై సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ఇప్పటికే అమెరికాలోని డల్లాస్‌లో లోకేశ్ పర్యటిస్తున్న విషయం తెలిసిందే.

# కరప్షన్ ఇండియా ?

## (డిసెంబర్ 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా)






"ఇందుగలడందులేడని సందేహము వలదు, ఎందెందు వెదకి చూచిన అందందే గలదు అవినీతి' అంటే సరిపోతుంది. ఇప్పటికే వ్యక్తుల అవినీతి, లంచగొండితనంతో ప్రజలు అష్టకష్టాలు పడుతుంటే తొండముదిరి ఊసరవెల్లి అయినట్లు, వ్యవస్థలు కూడా కేరాఫ్ కరప్షన్లుగా మారి దేశాన్ని కుదేలు చేస్తున్నాయి. ఒక వ్యక్తి లేదా సంస్థ లేదా తమవారి లాభం కోసం, అక్రమ ప్రయోజనాలను పొందేందుకు అధికారాన్ని దుర్వినియోగం చేయడమే అవినీతి. ప్రభుత్వం చేపట్టే రోడ్లు, భవనాలు, కాలువలు, వంతెనల నిర్మాణాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు అవినీతికి పాల్పడటంతో నాణ్యతా ప్రమాణాలు దారుణంగా పడిపోతున్నాయి. దీంతో అనేకమంది ప్రాణాలు కోల్పోతుండగా, మరికొంతమంది శాశ్వత దివ్యాంగులుగా మారిపోతున్నారు. ఈ పరిణామం అనేక కుటుంబాలు నడిరోడ్డున పడటానికి కారణమవుతోంది. ప్రభుత్వ డాక్టర్లు లంచం ఇవ్వలేదని రోగి ప్రాణాలను గాలిలో కలపడం, అర్హతగలవారిని కాకుండా అనర్హులను అధికారులు ఉద్యోగాల్లో నియామకాలు జరపడం, ఒకటేమిటి చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి. పెరుగుతున్న రేట్లతో నిత్యావసర వస్తువుల కొనుగోలు చేయడానికే సామాన్యుడు సతమతమవుతుండగా..అదే సమయంలో అవినీతి పరిస్థితులను మరింత దిగజారేలే చేస్తున్నాయి. వాస్తవానికి లంచం ఇవ్వడం, తీసుకోవడం భారతీయ చట్టాలు నేరంగా పరిగణిస్తాయి. ప్రభుత్వోద్యోగి అవినీతికి పాల్పడినప్పుడు, ప్రజాధనాన్ని అపహరించినప్పుడు ఉద్యోగం నుంచి తొలగించడం ఒక్కటే సరైన శిక్షని భారత సర్వోన్నత న్యాయస్థానం చెబుతోంది. అవినీతి కేసుల్లో డబ్బులు చిన్నదా ? పెద్ద మొత్తమా ? అనేది సమస్యే కాదని ఎంత తీసుకున్నా నేరమేనని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) స్పష్టం చేస్తోంది. మన దేశంలో దాదాపు మూడో వంతు మంది అవినీతిపరులే. ప్రజల్లో విలువలు కొరవడే కొద్దీ అవినీతి పెరిగిపోతోందని సామాజికవేత్తలు చెబుతున్నారు. ఒకప్పుడు అవినీతిపరుడ్ని సమాజం చిన్న చూపు చూసేదని, ప్రస్తుత సమాజం డబ్బు ఉంటే చాలు గౌరవంగా చూస్తోందని వారు వివరించారు. అవినీతి ఉద్యోగులను గుర్తించి త్వరితగతిన దోషులను కఠినంగా శిక్షించాలని న్యాయ నిపుణులు, సామాజికవేత్తలు, పౌర సమాజం కోరుతోంది. అవినీతి సూచికలో 2024 నాటికి 180 దేశాలలో భారతదేశం 96వ స్థానంలో నిలిచింది. ఐక్య రాజ్య సమితి ఆధ్వర్యంలో 2005 నుంచి ప్రతి ఏడాది డిసెంబర్ 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం జరుపుకుంటున్నాము. "యువతతో కలిసి అవినీతికి వ్యతిరేకంగా పోరాడి, రేపటి సమగ్రతను రూపొందించుదాం" స్లోగన్‌ను ఈ ఏడాది అంతర్జాతీ అవినీతి వ్యతిరేక దినోత్సవానికి ఎంపిక చేశారు. కేంద్రం, రాష్ట్రాలు, ప్రభుత్వ అధికారులు, పౌర సేవకులు, చట్ట అమలు అధికారులు, మీడియా ప్రతినిధులు, ప్రైవేట్ రంగం, పౌర సమాజం, విద్యాసంస్థలు, ప్రజలు, యువతతో సహా - ప్రతి ఒక్కరి హక్కులు - బాధ్యతలను తెలియచేయడమే ఈ స్లోగన్ ఉద్దేశం.

**అవినీతికి పరాకాష్ట**

అవినీతి మన దేశంలో ఎంతగా పాతుకుపోయిందో తెలియాలంటే మనం ఒక యధార్థ ఘటనను తెలుసుకోవాలి. రెకొండో పేరుతో పార్సీ సోదరులు మహారాష్ట్రలో రోడ్డు నిర్మాణ సంస్థను ప్రారంభించారు. పూనేలోని జంగ్లీ మహరాజ్ రోడ్డును వారు 1976లో నిర్మించారు. పదేళ్లలో రోడ్డు పాడైతే మరమ్మతులు ఉచితంగా చేస్తామని కూడా హామీ ఇచ్చారు. 50 ఏళ్లుగా ఆ రోడ్డు ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది. అయితే హృదయ విదారక ఘటన ఏమంటే ఆ కాంట్రాక్టరు ఆత్మ హత్య చేసుకొని చనిపోయాడు. కారణం అతనికి ప్రభుత్వం నుంచి మరే ఇతర కాంట్రాక్టులు లభించకపోవడమే.

**అవినీతిని అరికట్టడంలో కేరళ ఫస్ట్**

మన దేశంలో అవినీతి అతితక్కువ స్థాయిలో ఉన్న రాష్ట్రంగా కేరళ నిలిచింది. వందశాతం అక్షరాస్యత కలిగి ఉండటంతో పాటు, అవినీతి, లంచగొండితనంపై ప్రజలకు అవగాహన , రిక్షా కార్మికుడి స్థాయి వ్యక్తికూడా ముఖ్య మంత్రి తో సహా, మంత్రులు, ఉన్నతాధికారులు అందుబాటులో ఉండటంతో అవినీతి, లంచగొండులను ఆ రాష్ట్రం నివారించగలుగుతోంది. అవినీతి తక్కువగా ఉండటంతో అత్యంత దారిద్ర్య ప్రజల సంఖ్య కూడా ఆ రాష్ట్రంలో గణనీయంగా తగ్గి రికార్డులకెక్కింది.

**అవినీతి రహిత దేశాలు**

డెన్మార్క్, ఫిన్లాండ్, సింగపూర్, న్యూజిలాండ్, నార్వే, స్విట్జర్లాండ్, స్వీడన్‌లు, ప్రపంచంలోనే అతి తక్కువ అవినీతి దేశాలుగా గుర్తింపు పొంది, అంతర్జాతీయ ఆర్థిక పారదర్శకతలో స్థిరంగా ఉన్నత స్థానంలో ఉన్నాయి. దీంతో ఆయా దేశాలు 'ఆనంద' దేశాలుగా గుర్తింపు తెచ్చుకున్నాయి. 2025 సెప్టెంబరు 1, అతి తక్కువ అవినీతి దేశంగా డెన్మార్క్ అగ్రస్థానంలో నిలవగా, ఫిన్లాండ్, సింగపూర్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. మన దేశంలో అవినీతి కేసుల్లోని రాజకీయ నాయకుల జాబితా తక్కువే మీ కాదు. అత్యున్నతాధికారులు, రాజకీయ నాయకుల సంతానం వారి వ్యాపారాల్లో ప్రతి ఏడాది వేలాది రెట్లలో లాభాలు గడిస్తుండగా మధ్యతరగతి కుటుంబం పేద కుటుంబంగా, పేదలు-నిరుపేదలుగా మారుతున్నారు. కారణం అవినీతి. ధనవంతులు - పేదల మధ్య రోజురోజుకు అంతరం పెరగడం కూడా అందులో భాగమే. అవినీతి కారణంగా భారతదేశంలో ప్రతిరోజూ దాదాపు 20 కోట్ల మంది ప్రజలు ఆకలితో పడుకుంటున్నారు. 2024 డిసెంబర్ నివేదిక ప్రకారం, ప్రతిరోజూ 7,000 మంది ఆకలితో ప్రాణాలు కోల్పోతున్నారు. అందులో 3,000 మంది పిల్లలు. దేశంలో సంపద పెరిగినా వేళ్లపై లెక్కపెట్టే కార్పొరేట్ల వద్దకే అది చేరుతోంది. ఫలితంగా పేదల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అధికార పార్టీలు వారి వందిమాగధులు చట్టాలను అతిక్రమించి అధికార దుర్వినియోగానికి పాల్పడటంతో ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రజా తిరుగుబాట్లు జరుగుతున్నాయి. నా దేశంలో ఏ ఒక్కడు ఆకలితో పడుకున్నా.. అధ్యక్షుడిగా నేను విఫలం అయినట్టే అని చెప్పే ఆఫ్రికా దేశమైన బుర్గినా ఫాసో అధ్యక్షుడు, సైనికాధ్యక్షుడైన ఇబ్రహీం ట్రవోర్ వంటి నాయకుడు ప్రపంచ దేశాలకు అవసరం. రోడ్డు, వంతెనల నిర్మాణాల్లో భారీ అక్రమాలు, అవినీతి చోటు చేసుకోవడంతో జన నష్టమే కాకుండా మళ్లీ మళ్లీ వాటికి నిధులు కెటాయించడం వల్ల ఆయా అక్రమార్కులు కుబేరులుగా మారుతున్నారు. అదే సమయంలో విద్య, వైద్యం, ప్రభుత్వ గ్రామీణ ఉపాధి పథకం వంటి కీలకరంగాల్లో నిధులు నిండుకుంటున్నాయి. ఫలితంగా ఉత్తర భారతంలో సుమారు 90 వేల పాఠశాలలను మూసి వేశారు. అవినీతి సమాజంలో ఉద్యోగ కల్పనలు జరగకపోవడమే కాదు.. ఉన్న ఉద్యోగాలు కూడ పోతున్నాయి. దీంతో యువత నైరాశ్యానికి గురవుతుంది. లేదా విచ్ఛిన్నకర శక్తుల పంచన చేరుతోంది. లంచగొండులను, అవినీతి అక్రమార్కులను చీల్చి చెండాల్సిన వ్యవస్థలన్నింటినీ రాజకీయ నాయకులు నిర్వీర్యం చేశారు. స్వయం ప్రతిపత్తిగల న్యాయ, ఎన్నికల వ్యవస్థలు కూడా అభాసుపాలవుతున్నాయి. న్యాయమూర్తులు సాక్ష్యాధారాలను బట్టికాకుండా మనోభావాలను దృష్టిలో ఉంచుకొని తీర్పులు వెలువరించడం, పదవీవిరమణ అనంతరం రాజ్యాంగపదవులు చేపట్టడంతో వారు ప్రజల్లో నమ్మకాన్ని కోల్పోతున్నారు. ఎన్నికల కమిషన్ విషయం ఎంత చెప్పినా తక్కువే.. వాస్తవ ఓట్ల కంటే పోలయ్యే ఓట్లే ఎక్కువ. ఈ మ్యాజిక్‌ను చూసి ప్రపంచ దేశాలు పరిహసించినా నవ్విపోదురుగాక మాకేల సిగ్గు అని పాలకులంటున్నారు. ప్రజాస్వామ్యానికి నాలుగు స్తంభాలైన శాసనసభ, పరిపాలన, న్యాయవ్యవస్థలు ఘోరంగా విఫలం కాగా, గాటిన పెట్టాల్సిన మీడియా అధికార భజనలో మునిగి పోయింది. సామాన్యులు తమ భద్రత కోసం ముందు చూపుతో కూడబెట్టుకుంటున్న ఎల్ ఐసీ నిధులు పక్కదారి పట్టిన సంగతి కూడా విదేశీ పత్రికలు బయటపెట్టేవరకు తెలియకపోవడం ఇందుకు ఉదాహరణ. ఒక్క మాటలో చెప్పాలంటే దేశం యావత్తూ అవినీతిలో బంధీ అయ్యింది.

# ఆత్మకూరులో సర్దార్ 150 పాదయాత్ర










**ఆత్మకూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలంలో మేర యువ భారత్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్డీ ఓ కె.పావని, జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి, సెట్నెల్ సిఈఓ శ్రీనివాసులు, సీఐ గంగాధర్ పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి దాదాపు 3 కిలోమీటర్ల మేర సర్దార్ 150 పాదయాత్రను నిర్వహించారు. ఈ పాదయాత్రలో మండలంలోని యువత భారీగా, ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు, యువత ప్రదర్శించిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. వారికి జిల్లా యువజన అధికారి ఆధ్వర్యంలో బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ పావని మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్లాంటి మహానుభావుల జీవితం ప్రతి యువకుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఐక్యత, క్రమశిక్షణ, దేశాభిమానంతో ముందుకెళ్లే యువతే భారత భవిష్యత్తు అని అభిప్రాయపడ్డారు. ఈ తరహా కార్యక్రమాలు యువతలో సేవాభావం, సామాజిక బాధ్యత పెంపొందిస్తాయని తెలిపారు. తరువాత జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి మాట్లాడుతూ, సర్దార్ పటేల్ దేశాన్ని ఏకం చేయడానికి చేసిన కృషి అనన్య సామాన్యమని గుర్తుచేశారు. యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి ప్రభుత్వ యువజన సేవలు, మేర యువ భారత్ వంటి సంస్థలు చేస్తున్న కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. నేటి యువత సామాజిక సేవ, విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పాదయాత్రల వంటి కార్యక్రమాలు యువతలో ఆరోగ్య స్ఫూర్తిని పెంచడమే కాకుండా సమాజ సమస్యలపై అవగాహన పెంచుతాయని తెలిపారు. యువతలో ఉన్న శక్తి, ఆలోచన, సృజనాత్మకత దేశ పురోగతికి కీలకమని పేర్కొన్నారు. జిల్లాలో యువజన అభివృద్ధికి తగిన అన్ని కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పించిన పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రాంజీ నగర్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర నియోజకవర్గ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతిని పురస్కరించుకొని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జాతికి అందించిన సేవలను నేతలు స్మరించుకున్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన సేవలు ఎనలేనివని ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఈరోజు, సమాజంలో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల ప్రజలు సముచిత న్యాయం, గౌరవం పొందుతున్నారంటే.. అది అంబేద్కర్ కృషి ఫలితమేనన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన దిశగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పనిచేస్తుందన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి బడుగు బలహీన వర్గాల ప్రజలకు సముచిత గౌరవం కల్పించేలా చేసిన కృషి అందరికీ తెలిసిందేనన్నారు. నా ఎస్సీ, నా ఎస్టి, నా బీసీ నా మైనారిటీ అంటూ జగన్మోహన్ రెడ్డి వెనుకబడిన వర్గాల ప్రజలను అక్కున చేర్చుకొని వారికి సంక్షేమ ఫలాలు అందించిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డిదన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి విజయవాడలో భారీ అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పి అంబేద్కర్ గారి ఖ్యాతిని ప్రపంచ స్థాయిలో చాటారని తెలిపారు.

ఈరోజు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంబేద్కర్ విగ్రహం వద్ద శిలాఫలకాలు ధ్వంసం అవు తున్న పట్టించుకోకుండా అంబేద్కర్ గారి ప్రతిష్ట మసకబారేలా వ్యవహరిస్తుందని అన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన దిశగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తూ ఈరోజు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అప్పన్న పరిస్థితి బాగోలేదంటేనే ఆ రోజు సహాయం చేశా

**- మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కామెంట్స్‌కు ఎంపీ వేమిరెడ్డి కౌంటర్ - ఎవరు చెబితే సహాయం చేశానో మీకు తెలియదా? - ఈరోజు ఏ విధంగా అయితే సహాయం చేస్తున్నానో ఆరోజు కూడా అదే విధంగా చేశాను - సహాయం చేసి కూడా బండలు మోయాల్సి వస్తోంది - జగన్ మాటలు బాధేశాయి. అందుకే స్పష్టత ఇస్తున్నా : ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** అప్పన్న అనే వ్యక్తి కుటుంబానికి జరుగుబాటు లేకపోవడంతోనే తాను సేవాభావంతో రూ.50 వేలు చెక్కు ఇచ్చానని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి.. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గారిపై చేసిన అనవసర ఆరోపణలకు ఎంపీ వేమిరెడ్డి స్పష్టత ఇచ్చారు. కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్ తనపై అనవసరంగా కామెంట్స్ చేశారని, తాను ఏంటో ఆయన ఆత్మకే వదిలేస్తున్నానన్నారు. ఎవరు చెబితే తాను ఇచ్చానో తెలియదా అని ప్రశ్నించారు. శ్రీ కాకుళంకు చెందిన అప్పన్న అనే వ్యక్తి పేదవాడు, జరుగుబాటు లేదు అని నాడు వైవీ సుబ్బారెడ్డి దగ్గర చేరితే, సుబ్బారెడ్డి తాను సహాయం చేయలేను అని నన్ను అడిగితే... ఈ రోజు ఏ విధంగా అయితే సహాయం చేశానో.. ఆ రోజు కూడా అలాగే చేశానని కుండబద్దలు కొట్టారు. తాను మాట్లాడే విషయాలు సత్యమా, కాదా అనేది దేవుడి ముందుకు వచ్చి ప్రమాణం చేయాలన్నారు. ఎవరైనా నా దగ్గరికి వచ్చి జరుగుబాటు లేదని అంటే.. ఇప్పటికీ కూడా చాలామందికి సహాయం చేస్తున్నానని, తాను నెలలో సహాయం చేసేవాళ్ల లిస్ట్ తీస్తే చాలా మంది ఉంటారన్నారు.

ఈ విషయాలు వారికి కూడా తెలుసని, ఎవరు చెబితే ఇచ్చానో వారి దృష్టిలో ఉందన్నారు. అసలు తనపై అలాంటి మాటలు మాట్లాడాల్సిన అవసరమే లేదని ఖండించారు. సేవాభావంతోనే తాను సహాయం చేస్తుంటానని, సేవ చేయడం కూడా తప్పవుతోందని అన్నారు. బండలు మోయాల్సి వస్తోందని ఆవేదన చెందారు. ఎంత చేశామో, ఎవరికి చేశామో, మనం చేసే మంచేంటో దేవుడికే తెలుసని, జగన్ మోహన్‌రెడ్డి మాటలు బాధేశాయి కాబట్టే ఇప్పుడు చెబుతున్నానన్నారు.

# పోలీసులు వీరిని కూడా కాస్త పట్టించుకోండి.. మీ స్టైల్లో కౌన్సిలింగ్ ఇవ్వండి






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** చెవులు తూట్లు పడేలా..గుండెలు బద్దలయ్యేలా.. బిపి పెరిగేలా...కర్ణభేరి పగిలేలా... పసిబిడ్డలు అధిరి పడేలా...మైగ్రేన్ బాధితులు కళ్ళు నీళ్లు కారేలా ... వృద్ధులు ఉలిక్కి పడేలా మోడిఫైడ్ సైలెన్సర్ లతో భారీ సౌండ్లు వచ్చేలా చేస్తూ నెల్లూరు నగరాన్ని వణికిస్తున్న ఆకతాయిలు, పోకిరీలు. నెల్లూరు నగరంలో రోజురోజుకీ మోడీఫైడ్ సైలెన్సర్లతో భారీ శబ్దాలు వచ్చేలా బైకులు నడుపుతూ రద్దీ ప్రాంతాల్లో బాంబులు వేసినట్లు డాం డాం అంటూ శబ్దాలు వచ్చేలా చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న పోకిరిలు ఆకతాయిల పై పోలీసులు నగరంలో ప్రత్యేక డ్రైవులు నిర్వహించి ఇలాంటి మోడిఫైడ్ సైలెన్సర్లు బిగించిన వాహనాలు నడిపి ఆకతాయిలకు పోలీస్ స్టైల్‌లో కౌన్సిలింగ్ ఇస్తూ చట్టబద్ధంగా చలానాలు విధించాలని లేనిపక్షంలో పిల్లలు వృద్ధులు ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు సాధారణ ప్రజలు కూడా ఇలాంటి వారి వల్ల తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారని నగర ప్రజలు వాపోతున్నారు, ఇప్పటికే నెల్లూరు జిల్లాలో రౌడీలు ఆకతాయిలు క్రిమినల్స్ పై ప్రత్యేక ఫోకస్ పెట్టిన పోలీసులు ఎలాంటి వారిపై కూడా ప్రత్యేక డ్రైవులు చేపట్టడంతో పాటు బైక్ మెకానిక్లు ఇలాంటి సైలెన్సరు లు అమ్మే వారికి కూడా తగిన హెచ్చరికలు జారీ చేయాలని అప్పుడే ఇలాంటి మోడిఫైడ్ సైలెన్సర్ల విడుదల చేసే భారీ శబ్దాల నుండి నగర ప్రజలకు విముక్తి కలిగే అవకాశం ఉందని ప్రజలు కోరుతున్నారు.

# బెత్తం దెబ్బలు తీపి గుర్తులుగా మిగిలిపోవాలి

**- దెబ్బలు తిన్న చేతులే... నేడు జాతీయస్థాయిలో సంతకాలు చేస్తున్నాయి - ఆనాటి విద్యార్థుల గురుభక్తిని నేటి విద్యార్థులతో పంచుకున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి - ఉపాధ్యాయులది, విద్యార్థులది గొప్ప అవినావభావ అనుబంధం : మంత్రి ఆనం**





**చేజర్ల, (రాజధాని వార్తలు):** ఆనాటి గురువుల బెత్తం దెబ్బలు తీపి జ్ఞాపకా లుగా మిగిలిపోయాయని, దెబ్బలు తిన్న అరచేతులే నేడు ఉన్నత స్థానాల్లో సంతకాలు చేస్తున్నాయని ఆనాటి సంగతులను, గురువుల గొప్పతనాన్ని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నేటి తరం విద్యార్థులకు వివరించారు. ఇందుకు చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా నిలిచింది. పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఆత్మీయ సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సోషల్ మీడియాలో వచ్చిన ఒక వీడియోను విద్యార్థులకు విద్యార్థులకు చూపించారు. ఆ వీడియోలో ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్ వంటి అత్యున్నత రంగాల్లో మంచి గుర్తింపు పొందిన వారందరూ, తమకు బాల్యంలో విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయురాలిని గుర్తు పెట్టుకొని ఆమె వద్దకు వచ్చి, ఆమెతో వారి అనుబంధాన్ని గుర్తు చేసుకోవడం, తాము ఆనాడు తిన్న బెత్తం దెబ్బలను అరచేతులను చూపించి మళ్లీ కొట్టమని అడగడం వంటి మధురమైన దృశ్యాలను విద్యార్థులకు మంత్రి చూపించి, బెత్తం దెబ్బల మాధుర్యాన్ని, గురువులకు, విద్యార్థులకు ఉన్న అవినావభావ అనుబంధాన్ని నేటితరం విద్యార్థులకు వివరించారు.

నేటితరం విద్యార్థులందరూ గురువులను, తల్లిదండ్రులను గౌరవిస్తూ సత్ప్రవర్తనతో ముందుకు సాగితే విజ యాలను అందిపుచ్చుకోవచ్చని, మంచి పౌరులుగా రాణించి సమాజానికి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని ఈ సందర్భంగా మంత్రి ఆనం విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. సోషల్ మీడియా వీడియోను మంత్రి ఆనం విద్యార్థులకు వివరించిన తీరు ప్రతి ఒకరిని ఆలోచింపజేసింది... విద్యార్థుల్లో స్ఫూర్తి నింపింది.

# అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించిన వెంకటగిరి నియోజకవర్గం వైకాపా ఎస్‌సి సెల్ అధ్యక్షులు అభిరామ్



**డక్కిలి, (రాజధాని వార్తలు):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా తిరుపతి జిల్లా డక్కిలి మండలంలో వైఎస్ఆర్సిపి వెంకటగిరి నియోజకవర్గం ఎస్సి సెల్ అధ్యక్షులు గానుగ వెంకటబాబు (అభిరామ్) అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలైన మానవత్వం, మానవ హక్కులు, కుల నిర్మూలనను స్మరించుకుంటూ సామాజిక న్యాయం కోసం పోరాడిన భారత రాజ్యాంగ మహనీయుడిగా పేరు పొంది దళితులు పట్ల నాడు ఉన్న వివక్షను రూపుమాపేందుకు అంబేద్కర్ తన జీవితకాలం చేసిన పోరాటం మరువలేనిదని, అంటరానితనం గురించి ఆయన చేసిన పోరాటం చిరస్థాయిగా నిలిచిపోయిందని, కుల మత రహిత ఆధునిక భారతదేశం కోసం అంబేద్కర్ తన జీవితకాలం పోరాటం చేశారని, తెలియజేశారు. సామాజిక సంస్కర్తగా భారతీయులకు పరిచయం చేయక్కర్లేని పేరు అంతకంటే మిన్నగా రాజ్యాంగ నిర్మాతగా ఆయన పేరు చరిత్ర ఉన్నంతకాలం పదిలంగా ఉంటుందని ఆయన పూరించిన సమర శంఖం నేటికీ ఆగ్రహ జ్వాలలు పెల్లుబుకుతూనే ఉందని, దళితులు మహిళలు కార్మికుల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని తెలియజేశారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వ పాలనలో దళితులపై అన్యాయాలు, అక్రమాలు, అరాచకాలకు పాల్పడుతున్న రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నిర్మూలింప చేసేందుకు రాష్ట్రంలో దళితులంతా ఏకమై తిరిగి మళ్లీ అంబేద్కర్ రాజ్యాంగం బుక్‌కి శ్రీకారం చుట్టే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక దళ్ వెంకటగిరి నియోజకవర్గ అధ్యక్షులు చిట్టేటి రాజా, శేషం ప్రసన్న కుమార్, నావూరు కోటేశ్వరరావు, లింగసముద్రం చెందు, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు అండగా.. మదినిండా పండుగ

**- నేడే సిటీ నియోజకవర్గ ఎలక్ట్రిల్ ట్రై సైకిళ్ల పంపిణీ, కూటమి నాయకుల ఆత్మీయ సమావేశం - విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న ఏర్పాట్లు - విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు దాదాపు 950 ట్రై సైకిళ్ల అందజేత - హాజరు కానున్న ఎంపీ వేమిరెడ్డి, మంత్రి పొంగూరు నారాయణ**








**నెల్లూరు, (రాజధాని వార్తలు):** దివ్యాంగులకు అండగా నిలుస్తూ.. వారి మదిలో సంతోషం నింపుతూ ఒక గొప్ప ఆశయంతో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నెల్లూరు సిటీ నియోజకవర్గ ఉచిత ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి ముహూర్తం కుదిరింది. ఈ నెల 7న ఆదివారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర పురపాలక శాఖామాత్యులు పొంగూరు నారాయణ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించనుండగా.. విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో అన్ని ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఇప్పటికే సభా ప్రాంగణానికి ట్రై సైకిళ్లు చేరుకున్నాయి. ట్రై సైకిళ్ల పంపిణీ అనంతరం నెల్లూరు సిటీ నియోజకవర్గస్థాయి తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరగనుంది. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో దివ్యాంగులను గుర్తిస్తూ.. వారికి అండగా, భరోసాగా నిలిచేందుకు వారిలో ఆత్మ విశ్వాసం నింపేలా ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లు అందిస్తూ వస్తున్నారు. నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేల సహకారంతో ఇప్పటికే కోవూరు, ఉదయగిరి, కందుకూరు, కావలి, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో ఆత్మీయ సమావేశాలు, దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ల పంపిణీ పూర్తి చేయగా.. ఆత్మకూరులో మంత్రి ఆనంతో ఆత్మీయ సమావేశం, ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. రేపు ఆదివారం మంత్రి నారాయణతో కలిసి సిటీ నియోజకవర్గానికి చెందిన దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందించనున్నారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ల పంపిణీ చేపట్టగా.. ఇప్పటికే ఉదయగిరి, ఆత్మకూరు, కోవూరు, కందుకూరు, కావలి, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో దాదాపు 950 మంది దివ్యాంగులకు ఎంపీ వేమిరెడ్డి ట్రై సైకిళ్లు అందించారు. ఒక్కో ట్రై సైకిల్ విలువ రూ.45 వేలకు పైనే ఉండగా.. ట్రై సైకిళ్లు అందించడంతో పాటు వాటి నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం నెల్లూరు సిటీ నియోజకవర్గంలో దాదాపు 84 మంది దివ్యాంగులను గుర్తించి వారికి ట్రై సైకిళ్లు అందించనున్నారు. ట్రై సైకిళ్ల పంపిణీ జరుగుతుండగానే.. మరో వినూత్న కార్యక్రమం విపిఆర్ నేత్ర వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. కంటి చూపు సరిగా లేని వారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తూ.. ఉచితంగా అద్దాలు అందజేస్తున్నారు. ఇప్పటికే వరికుంటపాడు మండలంలోని 24 పంచాయతీల్లో నేత్ర సేవలు అందించగా దాదాపు 5257 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 2845 మందికి కంటి అద్దాలు అందజేశారు.

ప్రస్తుతం విపిఆర్ నేత్ర సేవలు ఉదయగిరి మండలంలోని పంచాయతీల్లో కొనసాగుతున్నాయి. నెల్లూరు సిటీ నియోజకవర్గానికి సంబంధించి ట్రై సైకిళ్ల పంపిణీ, ఆత్మీయ సమావేశం ఈ నెల 7న ఆదివారం ఉదయం 10:00 గంటలకు నెల్లూరు సమీపంలోని కనుపర్తిపాడులో ఉన్న విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నారు. సమావేశానికి సంబం ధించి ఇప్పటికే ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్

**- ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందాలి - నాయకులు, అధికారుల మధ్య సమన్వయం అవసరం - ప్రజా సమస్యల పరిష్కారంలో స్థానిక నాయకులు చొరవ చూపాలి - ప్రతి నాయకుడు వారంలో ఒక్క రోజు ప్రజల కోసం కేటాయించాలి - కొడవలూరు ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**










**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఎమ్మెల్యేలే ప్రజల వద్దకు వెళ్లి ప్రజా సమస్యలు పరిష్కరించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా దర్బార్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. కొడవలూరు మండల ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ విడవలూరు మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ స్థానిక నాయకులు, అధికారులతో సమన్వయం చేసుకొని ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని కోరారు. ప్రతి నాయకుడు వారంలో ఒక రోజు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కేటాయించాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటిని పరిష్కరించడమే ప్రజా దర్బార్ కార్యక్రమ లక్ష్యమన్నారు. ప్రజా సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించడానికే ప్రజల మధ్యకు వచ్చానన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తాననని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి హామీ యిచ్చారు. ఇళ్ళు, ఇళ్ల స్థలాలు లేని వారు ఈ నెల 14లోపు సమీప సచివాలయాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. స్థానిక నాయకులు మరియు సచివాలయ సిబ్బంది ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు తెలియచేయాలన్నారు. ప్రజా దర్బార్‌లో రోడ్లు, డ్రైన్లు, పాఠశాల భవనాలు, ఇళ్ళు, ఇంటి స్థలాలు కావాలన్న ప్రజల విన్నపాలను త్వరగా పరిష్కరించేలా అధికారులను ఆదేశిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కొడవలూరు మండల తహసీల్దార్ స్ఫూర్తి రెడ్డి, ఎంపీడీఓ సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కరకట్ట మల్లికార్జున రావు, ఎంపీటీసీ రాజా, మండల నాయకులు వెంకట రమణారెడ్డి, వినీల్, సతీష్ రెడ్డి, మదన్‌లతో పాటు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దశాబ్దాల కలకు స్వస్తి

**- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో ఎట్టకేలకు సహకారం - జనవరి 5వ తేదీ ఉదయం 10 గంటల 5 నిమిషాలకు పొట్టేపాలెం బ్రిడ్జికి శంకుస్థాపన**




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. నెల్లూరు రూరల్‌లోని పొట్టేపాలెం బ్రిడ్జి కల సాకారం అయింది. 5 కోట్ల వ్యయంతో జనవరి 5వ తేదీన శంకుస్థాపన. 8 నెలల్లో పూర్తిచేసి, ప్రజలకు అంకితం చేస్తాం. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. పొట్టేపాలెం కలుజు మీద బ్రిడ్జి పూర్తి అయ్యేలోపు ములుముడి కలుజు మీద బ్రిడ్జి కి కూడా శంకుస్థాపన చేస్తాం. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. నెల్లూరు రూరల్ లో అభివృద్ధి జాతర కొనసాగుతోంది. నెల్లూరు కార్పొరేషన్‌లో త్వరలో రెండో విడత అభివృద్ధి పనులు జరుగుతాయి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. ములుముడి బ్రిడ్జి పూర్తి అయితే ఎన్నికల్లో నేను ఇచ్చిన 100 శాతం హామీలు పూర్తి అవుతాయి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. మూడు సార్లు భారీ మెజార్టీతో ప్రజలు గెలుపొందించారు. రూరల్ అభివృద్ధితోనే ప్రజల రుణాన్ని తీర్చుకుంటాం. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి.




## ఎన్ఎంసిలో నూతనంగా ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటు

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వై ఓ నందన్ కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణం పురసేవా విభాగం నందు నూతన ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభించటం జరిగినది. ఇందులో మొదటి సర్వీస్‌గా కమిషనర్ నందన్ ఆధార్ సేవలు వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ మాధురి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శేషగిరిరావు, రహంతు జానీ, నరేంద్ర వివిధ విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# నిశ్శబ్దంగా పెరుగుతున్న గుండె వ్యాధులు

**- తీర ఆంధ్రను ప్రభావితం చేస్తున్న ఈ నిశ్శబ్ద ఆరోగ్య సంక్షోభాన్ని అరికట్టాలంటే, శరీరం పంపే చిన్న సంకేతాన్నే సీరియస్‌గా తీసుకోవాలి : మెడికవర్ హాస్పిటల్స్ గుండె వ్యాధి వైద్యనిపుణులు డా. విఘ్న చరణ్**



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** భారతదేశంలో హృదయవ్యాధులు వేగంగా పెరుగుతూ, పెద్దల మరణాల్లో ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 5–6% మంది పెద్దలు గుండె సంబంధిత సమస్యలను అనుభవిస్తున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా తీర ఆంధ్ర ప్రాంతం నెల్లూరు, ప్రకాశం, గుంటూరు వంటి జిల్లాల్లో వాల్వ్ వ్యాధులు, బ్లాకేజీలు మరియు ఇన్‌ఫెక్షన్ తర్వాత వచ్చే గుండె సమస్యలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ వృద్ధిలో అత్యంత ఆందోళనకర విషయం లక్షణాలు ప్రారంభంలో చాలా నిశ్శబ్దంగా ఉండటం. గ్రామీణ దక్షిణ భారతదేశంలో గుండె సంబంధిత మరణాల్లో దాదాపు 30% కేసులు లక్షణాల్ని నిర్లక్ష్యం చేయడం వల్లనే సంభవిస్తున్నాయని కార్డియాక్ నిపుణులు చెబుతున్నారు. ఉబ్బసం, కాళ్ల వాపు, హృదయ స్పందనలు అసహజంగా ఉండటం, పనులు చేసేటప్పుడు త్వరగా అలసిపోవడం మొదట్లో పెద్ద సమస్యలా అనిపించకపోవచ్చు. ఈ లక్షణాలు పని ఒత్తిడి, వయస్సు పెరుగుదల లేదా శరీర బలహీనతలా కనిపిస్తాయి. కానీ ఈ చిన్న సంకేతాలే గుండె వ్యాధుల మొదటి అడుగులు. ఇటీవలి కాలంలో నెల్లూరు సమీపంలోని 48 ఏళ్ల వ్యక్తి విషయంలో ఇదే జరిగింది. తక్కువ శ్రమకే అలసట పెరుగుతున్నా పట్టించుకోలేదు. చివరకు మెట్లెక్కడమే కష్టంగా మారినప్పుడు కుటుంబ సభ్యుల ఒత్తిడితో హాస్పిటల్‌కు వెళ్లాడు. పరీక్షల్లో తీవ్ర మైట్రల్ వాల్వ్ వ్యాధి బయట పడింది. చిన్ననాటి గొంతు ఇన్‌ఫెక్షన్లు సరైన సమయంలో చికిత్స కాకపోతే ఏర్పడే ప్రమాదాలలో ఇదొక్కటే. శస్త్రచికిత్స సమయానికి చేయడంతో అతను కొద్ది వారాల్లోనే పూర్తిగా కోలుకున్నాడు. ఈ సంఘటన ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది. గుండె వ్యాధులు పెద్దగా కనిపించకపోయినా, వాటి ప్రభావం మాత్రం తీవ్రమై ఉంటుంది. "గుండె వ్యాధులు చాలా సంవత్సరాలు శరీరంలో నిశ్శబ్దంగా పెరుగుతుంటాయి. రోగులు ఉబ్బసం స్పష్టంగా అనిపించే సమయానికి గుండె ఇప్పటికే ఒత్తిడిలోకి వెళ్లిపోయి ఉంటుంది. సమస్యను ముందుగా గుర్తిస్తే చికిత్స ఎప్పుడూ సులభం, ప్రమాదాలు తక్కువ." వైద్య నిపుణులు 35 ఏళ్ల పై వయస్సు గలవారుప్రత్యేకించి రక్తపోటు, షుగర్, ఎక్కువసేపు కూర్చునే జీవనశైలి, చిన్నపాటి గొంతు ఇన్‌ఫెక్షన్ల చరిత్ర లేదా కుటుంబంలో గుండె వ్యాధులు ఉన్నవారుతప్పనిసరిగా రొటీన్ హార్ట్ చెక్‌అప్స్ చేయించుకోవాలని సూచిస్తున్నారు. సాదా ఈకో, ఈసీజీ వంటి ప్రాథమిక పరీక్షలతోనే చాలా వ్యాధులను ప్రమాద దశకు ముందే గుర్తించడం పూర్తిగా సాధ్యం.

rajadhanivartalu.com



# సంపాదకీయం

## దైవసన్నిధిలో నేరాలకు జగన్ వత్తాసు

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రెండు రోజుల క్రితం విలేఖరుల సమావేశంలో చెప్పిన మాటలు, చేసిన ఆరోపణలను బట్టి... రాష్ట్ర ప్రజలు పుట్టెడు కష్టాలలో ఉన్నారని ఎవరైనా నమ్మాల్సిందే! అంతేకాదు, గత ఎన్నికలలో కూటమి నాయకుల మాటలు నమ్మి, ప్రజలు ఆయనకు 11 సీట్లే ఇచ్చి అన్యాయం చేశారన్న భావన కూడా కలుగుతుంది. 30 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా కొనసాగాలన్న తన కలలను కూటమి నాయకులు కల్లబొల్లి కబుర్లతో కల్లలు చేశారన్న ఉక్రోషం కూడా ఆయన మాటల్లో కనిపించింది. సుదీర్ఘంగా 2 గంటలా 43 నిమిషాల పాటు సాగిన విలేఖరుల సమావేశంలో జగన్‌రెడ్డి చెప్పిన మాటలన్నీ నిజమా? అన్న అనుమానం కించిత్ కూడా రాకుండా ఆయన తనలోని నటనా కౌశలాన్ని ప్రదర్శించారు. గతంలో కేసీఆర్ ఒక్కరే ఇలా గంటలకొద్దీ విలేఖరుల సమావేశాలు నిర్వహించేవారు. అయితే, ఆయన మధ్య మధ్యలో పిట్ట కథలు చెబుతూ విలేఖరులకు బోర్ కొట్టకుండా ఉత్తేజపరిచేవారు. ఈ చాతుర్యం జగన్‌లో లేనందున సదరు సమావేశానికి హాజరైన విలేఖరులకు కచ్చితంగా బోర్ కొట్టి ఉంటుంది. అయినా ఆయన తాను చెప్పాలనుకున్న వాటిని చిత్ర విచిత్ర హావభావాలతో చెప్పుకొన్నారు. ఒక నార్సిసిస్టిక్ పర్సనాలిటీ నోటి వెంట వెలువడిన అసత్యాలను, అర్ధసత్యాలను పట్టించుకోవడం ఎందుకులే అనుకోకుండా కూటమి ప్రభుత్వంలోని పలువురు మంత్రులు ఆ వెంటనే స్పందించి జగన్‌రెడ్డికి బదులిచ్చారు. ఇంతవరకు జగన్‌రెడ్డి సక్సెస్ అయ్యారు. అయితే, జగన్‌రెడ్డి తనలోని అక్కసును దాచుకోకుండా మధ్య మధ్యలో వెళ్లగక్కారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పి.కృష్ణయ్యను, ఆయన బంధువు గోపీనాథ్ జెట్టి అనే ఐజీ స్థాయి అధికారిని 'వాడూ వీడూ' అని సంబోధించడం ద్వారా తనలోని కక్షను ఆయన ప్రదర్శించారు. ఇదే పని చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ చేసి ఉంటే బీసీ వర్గానికి చెందిన, అది కూడా యాదవ కులానికి చెందిన అధికారులను అవమానించారని నీలి మీడియా, కూలి మీడియా గగ్గోలు పెట్టి ఉండేది. గత ప్రభుత్వంలో హద్దులు మీరి ప్రవర్తించడమే కాకుండా అవినీతికి పాల్పడిన ఆరోపణలపై ఒకరిద్దరు అధికారులు విచారణ ఎదుర్కొంటున్న నేపథ్యంలో... 'దళిత అధికారులపై కక్ష ఏమిటి?' అని ఇదే నీలి, కూలి మీడియా వాపోవడం చూశాం. జగన్మోహన్‌రెడ్డి తనలోని నటనా కౌశలాన్ని ఎంతలా బయటకు తీసినా మధ్య మధ్యలో తన నిజ స్వరూపాన్ని దాచుకోలేకపోతున్నారు. ఫలితంగా అవతలి వారిని ఏక వచనంతో 'వాడూ వీడూ' అనీ సంబోధిస్తుంటారు. విలేఖరుల సమావేశంలో జగన్‌రెడ్డి చెప్పిన మాటలను ఎంత మంది నమ్మారో తెలియదు గానీ... విలేఖరులు మాత్రం బాధితులయ్యారు. జగన్మోహన్‌రెడ్డి ఉపన్యాసం మొదలుపెడితే ఎంత తొందరగా వదిలిపెడతారా? అని ఎదురుచూస్తానని ఆయన పార్టీకే చెందిన మాజీ మంత్రి పేర్ని నాని ఎక్కడో చెప్పినట్టు గుర్తు! సొంత పార్టీ వారే భరించలేని ఆయన ఉపన్యాసాలను విలేఖరులు నిర్బంధంగా భరించాల్సి రావడం విషాదమే! జగన్ నోటి వెంట వెలువడిన కొన్ని ఆణిముత్యాల గురించి ఇప్పుడు చర్చించుకుందాం! ఎన్నికల హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తున్నందుకు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లను బొక్కలో వేయాలని జగన్‌రెడ్డి కోరుతున్నారు. నిజంగా అలా చేయవలసి వస్తే ఈ దేశంలో ఒక్క రాజకీయ నాయకుడు కూడా బయట తిరగలేరు. అందరూ జైల్లోనే ఉండాలి. ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా అధికారం అనుభవించిన జగన్‌రెడ్డి కూడా అమలు చేయలేకపోయిన ఎన్నికల హామీలు ఎన్నో ఉన్నాయి. అందులో ముఖ్యమైనది మద్య నిషేధం! ఎన్నికల సందర్భంగా అధికారంలోకి రావడంకోసం ప్రజలు కోరుకున్నా కోరుకోకపోయినా నోటికొచ్చిన వాగ్దానాలు చేయడం మన దేశంలోని నాయకులకు పరిపాటి అయింది. అధికారం అప్పగిస్తే స్వర్గాన్ని దివి నుంచి భువికి తీసుకు వస్తామని చెబుతారు. అందరికీ అన్నీ ఉచితంగా ఇస్తామని చెబుతారు. నిజానికి ప్రజలు అవేవీ నమ్మరు. అప్పటి పరిస్థితులను బట్టి తాము ఎవరికి ఓటు వేయాలో వారికే వేస్తారు. అధికారంలో ఉన్న పార్టీపై కోపం ఉంటే ప్రతిపక్షంలో ఉన్న పార్టీని ఎంచుకుంటారు. 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇదే చేశారు. జగన్‌రెడ్డి పాలనలో దిమ్మ తిరిగి బొమ్మ కనపడటంతో 164 సీట్లలో కూటమిని గెలిపించి, జగన్‌రెడ్డికి 11 సీట్లే ఇచ్చారు. ప్రజల తీర్పు ఈ విధంగా ఉండబోతోందని చంద్రబాబుగానీ, జగన్‌రెడ్డి గానీ ఊహించలేదు. ఎలాగైనా అధికారంలోకి రావాలన్న ఆరాటంతో ప్రజలు కోరుకోకపోయినా చంద్రబాబు అనవసర వాగ్దానాలు చేశారు. అయితే ప్రజలు వాటిని నమ్మి, ఆయన పార్టీకి ఓట్లు వేయలేదు. 2019 ఎన్నికల్లో నమ్మి, అధికారం కట్టబెడితే జగన్‌రెడ్డి అరాచకంగా పాలించారన్న కోపంతోనే ప్రజలు కూటమికి కనీవినీ ఎరుగని మెజారిటీ ఇచ్చారు. ఈ వాస్తవాన్ని విస్మరించి, హామీలు అమలుచేయనందుకు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను బొక్కలో వేయాలని జగన్‌రెడ్డి కోరుకోవడం విడ్డూరంగా ఉంది. అవినీతి ఆరోపణలపై కొంత కాలం జైలు జీవితం గడిపిన జగన్‌రెడ్డి తనవలే మిగతా నాయకులు కూడా జైలు జీవితం గడపాలని కోరుకుంటున్నట్టు ఉంది. అందుకే కాబోలు, తాను అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబును తాడూ బొంగరం లేని స్కిల్ కేసులో జైల్లో పెట్టించారు. హామీలు అమలు చేయని వారిని బొక్కలో వేయాలన్న జగన్‌రెడ్డి ఫిలాసఫీ ప్రకారమైతే ఓటర్లను కూడా జైల్లో పెట్టాలి. ఎన్నికల సందర్భంగా చాలామంది అన్ని పార్టీల నుంచీ డబ్బు తీసుకుంటున్నారు. చివరికి ఏదో ఒక పార్టీకే ఓటేస్తున్నారు కదా? డబ్బు తీసుకొని ఓటు వేయకపోవడం నేరమే కదా? తమకు ఇష్టం లేని పార్టీ నుంచి డబ్బు తీసుకోకూడదు కదా? యథా రాజా తథా ప్రజా అన్నట్టుగా ఇప్పుడు అందరూ తప్పు చేస్తున్నారు.

# మానే రామకృష్ణను అఖండ మెజారిటీతో గెలిపించండి

**- మానే ప్యానల్ గెలుపు కోరుతూ ఎమ్మెల్సీ తాతా మధు విస్తృత ప్రచారం**

**- 15వ వార్డు కూటమి అభ్యర్థి ఊకే పుష్పలతను ఆదరించండి**





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ, బి.ఆర్.ఎస్. (బి ఆర్ ఎస్) పార్టీ నాయకులు శ్రీ తాతా మధుసూదన్ స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో చురుకుగా పాల్గొన్నారు. శనివారం 15వ వార్డులో ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ మద్దతుతో బరిలో ఉన్న సిపిఎం జిడిపి బలపరిచిన బిఆర్ఎస్.కూటమి సర్పంచ్ అభ్యర్థి మానే రామకృష్ణను లేడీ పర్స్ గుర్తుకు ఓటు వేసి మరియు కూటమి 15వ వార్డు సభ్యురాలు ఊకే. పుష్పలతను గ్యాస్ పొయ్యి గుర్తు ఓటు వేసి. వీరితో పాటుగా 20 మంది కూటమి వార్డు సభ్యులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన పట్టణ ప్రజలను కోరారు. భద్రాచలంలో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోట్ల రూపాయల కాంట్రాక్టర్ అని మరో పార్టీ నాయకుడు బిజెపి అభ్యర్థి కోట్లకు అధిపతి అని ఈ నాయకులు కోట్లు ఖర్చుపెట్టి గెలిచిన ప్రజలకు అందుబాటులో ఉండరు అన్నారు. అందుకే భద్రాచలం పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్న స్థానికుడు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే సామాన్యుడు ప్రజల కోసం తన ఉద్యోగానికి రాజీనామా చేసి పేద ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చిన భద్రాచలం నియోజకవర్గం లో రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసిన వ్యక్తి నిస్వార్థపరుడు అందరికీ అందుబాటులో ఉండే బిఆర్ఎస్ కూటమి సర్పంచ్ అభ్యర్థి మానే రామకృష్ణను గెలిపించండి స్థానిక అభివృద్ధికి, పేదల సంక్షేమానికి కృషి చేస్తారని, గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దగలరని ఆయన పూర్తి నమ్మకాన్ని వ్యక్తం చేశారు. గతంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను, భవిష్యత్తులో చేపట్టబోయే ప్రణాళికలను వివరిస్తూ ఓటర్లను ఆకర్షించారు.

**15వ వార్డు అభ్యర్థి పుష్పలతను గెలిపించండి**

15వ వార్డు సభ్యురాలిగా పోటీ చేస్తున్న ఊకే పుష్పలతను గెలిపించాలని ఈ వార్డు అభివృద్ధికి చేయడానికి ఆమె సమస్యల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉన్నారని, వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తారని ఆయన పేర్కొన్నారు. వార్డు ప్రజలంతా కలిసికట్టుగా పుష్పలతని గెలిపించాలని మధు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో స్థానిక బి.ఆర్.ఎస్. సిపిఎం జిడిపి కూటమి నాయకులు రావులపల్లి రాంప్రసాద్ సునీల్ ఏజే రమేష్ గడ్డం స్వామి, గుండు శరత్ కార్యకర్తలు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు పర్యటనతో అభ్యర్థుల్లోనూ, కార్యకర్తల్లోనూ కొత్త ఉత్సాహం నిండింది.

# విజయవంతంగా ముగిసిన ఎన్.ఎస్.ఎస్ వారోత్సవాలు

**- పర్యావరణాన్ని పరిరక్షించే క్రమంలో వాలంటీర్లు గ్రామాలలో మొక్కలను నాటారు**






**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని బూడిపేట, దావలపేట గ్రామాలలో ప్రత్యేక జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం పలు కార్యక్రమాలు జరిగాయి. ముందుగా వాలంటీర్లు పర్యావరణాన్ని పరిరక్షించే క్రమంలో భాగంగా మొక్కలు నాటి రెండు గ్రామాలలో తమ సేవలను అందించారు. ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్లు ఎన్.శ్రీనివాసరావు, వి.భాను ప్రసాద్రావుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగింపు సభలో ప్రిన్సిపల్ రావాడ సత్యనారాయణ మాట్లాడుతూ, సమాజానికి సేవ చేయాలనే తపనతో విద్యార్థులు ఎన్.ఎస్.ఎస్ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని కోరారు. గ్రామ సర్పంచ్ బూడి జ్యోతి మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, పరిశుభ్రత, పచ్చ ధనం కార్యక్రమాలకు వారోత్సవాలలాంటి సేవా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఎన్.ఎస్.ఎస్ కో - ఆర్డినేటర్లు మాట్లాడుతూ,యువత సామాజిక బాధ్యతను భుజ స్కందాలపై వేసుకొని గ్రామాభివృద్ధికి ముందు వరుసలో నిలబడాలని కోరారు. తమ గ్రామాలలో వారోత్సవాలలో భాగంగా చేసిన సేవలకు గాను, గ్రామ యువత వాలంటీర్లకు బహుమతులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ వారోత్సవాలు విజయవంతంగా ముగిసినట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బూడి వెంకటరావు,డి. తిరుపతిరావు, బూడి వేణు, రెడ్డి ప్రసాద్, డీ.ఎస్ మాధవరావు, ఎం.శ్రీనివాసరావు, మోహన రాజు, అచ్చం నాయుడు, అచ్యుతరావు, వి.శ్రీనివాసరావు తదితరులు హాజరై వాలంటీర్లను అభినందించారు.

# మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా భారత రాజ్యాంగ నిర్మాత వర్ధంతి









**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి 69వ వర్ధంతి సందర్భంగా ఈరోజు భద్రాచలం మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోట దేవదానం మాట్లాడుతూ... ఈ దేశంలో అణగారిన వర్గాలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వం కోసం పెద్ద యుద్ధమే చేసిన మహానుభావుడు డాక్టర్ అంబేద్కర్‌ని, ఈ దేశానికి దిశా దశ చేసిన గొప్ప దార్శనీకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సున్నం రమేష్, సెక్రటరీ శ్రీనివాస్, పామ రాజు తిరుమలరావు, మాదిగ జేఏసీ నాయకులు ముద్దా పిచ్చయ్య, గురజాల వెంకటేశ్వర్లు, తోకల దుర్గాప్రసాద్, విసంపల్లి ముత్యం, బొక్క పున్నయ్య గుండె సుహాసిని, వలదాసు వెంకట నరసమ్మ.

# రుణాలు రద్దు చేయాలంటూ టిడ్కో లబ్ధిదారులు ధర్నా



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సొంతిల్లు కళాశాకారం విషయంలో టిడ్కో గృహాలకు ప్రభుత్వం అందించిన బ్యాంకు రుణాలు తమకు భారం అయినందున ఆ రుణాలను మాఫీ చేయాలని టిడ్కో గృహాల లబ్ధిదారులు శనివారం ధర్నా చేపట్టారు. సామర్లకోట జగ్గమ్మ గారి పేటలో ఉన్న టిడ్కో గృహ సముదాయాల వద్ద లబ్ధిదారులైన మహిళలు ఆందోళన నిర్వహించారు. పదేళ్ల క్రితం గృహాలను అప్పగించక ముందే రుణాల మంజూరు, వడ్డీలు విధించడంతో ఇప్పుడు ఆ మొత్తాలు భారీగా పెరిగిపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి గృహాల కోసం లక్ష రూపాయలు, యాభై వేలు, 5000 చొప్పున తమ వాటా చెల్లించగా ఇప్పటికీ అధికారులు లబ్ధిదారులకు చాలా గృహాలు అప్పగించని పరిస్థితులున్నాయన్నారు. తాము చెల్లించగా ఇప్పటికే వాటికి వడ్డీలు చెల్లిస్తూ అద్దె గృహాల్లో నివాసం ఉంటున్నామని చెప్పారు. ఎలా ఉండగా గృహాలకు సంబంధించి రుణాల బకాయిలను ఒకే సారి వారం రోజుల్లో చెల్లించాలంటూ అధికారులు డిమాండ్ చేయటంతో ఇబ్బందులకు గురవుతు న్నట్లు బాధితులు తెలిపారు. ఎన్నికల సమయంలో నేతలు గృహాలకు సంబంధించి రుణాలను రద్దు పరుస్తామని హామీలు ఇవ్వడం మినహా వాటిని అమలు చేయలేదన్నారు. ఏ రోజుకు ఆ రోజు కష్టపడి పని చేసుకునే తాము బ్యాంకు రుణాలు చెల్లించాలా, చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకోవాలా, లేదంటే తాము నివసిస్తున్న ఇళ్లకు అద్దెలు చెల్లించాలో అర్థంకాని అయోమయ పరిస్థితుల్లో తామున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తమ ఇబ్బందులను అర్థం చేసుకుని తక్షణమే రుణాలను రద్దు చేయాలని బాధితులు డిమాండ్ చేశారు.

# టౌన్ బస్ డ్రైవర్ కండక్టర్లపై గంజాయి ముఠా దాడి చేయడం హేయమైన చర్య

**- సిఐటియు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు**



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని బోసు బొమ్మ వద్ద గంజాయి మూకల దాడిలో గాయపడి నారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మన్సూర్ సలీంలను ఆదివారం సిఐటి యు నెల్లూరు నగర నాయకులు ఏ శ్రీనివాసులు, ఆర్ శ్రీనివా సులు, మూలం ప్రసాద్ పరామర్శించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆర్డిటి కాలనీలో జరిగిన పెంచలయ్య హత్య ఘటనను మరువక ముందే మరోసారి గంజాయి ముఠా నెల్లూరులో స్వైర విహారం చేయడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వం గంజాయి మాఫియాను అరికట్టేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని, ప్రజలకు రక్షణ కల్పించాలని, సామాన్యులు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితులు నెలకొల్పాలని, మన్సూర్ సలీంలపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ముగిసిన "విజన్ బిల్డింగ్" శిక్షణ కార్యక్రమం




**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గత నాలుగు రోజులుగా స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో జరుగుతున్న విజన్ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమం ముగిసింది. చివరి రోజు కార్యక్రమంలో డిఆర్డిఏ అదనపు పథక సంచాలకురాలు (ఏపీడి) కె.సావిత్రి పాల్గొని మాట్లాడుతూ, నాలుగు రోజులపాటు నేర్చు కున్న అంశాలు గ్రామాలలో అమలు చేయాలని ,అలాగే రాబోయే ఐదు సంవత్సరాలకు ప్రణాళికలు వ్యక్తిగతమైన సంఘం, గ్రామ సంఘాలు వారీగా తయారు చేసుకొని వాటిని అమలు చేయాలన్నారు. గ్రామ సంఘం అధ్యక్షులు, గ్రామ సంఘ సహాయకులు ఆయా గ్రామాలలో యాక్షన్ ప్లాన్ ప్రకారం సమావేశాలు నిర్వహించి, సంఘంలో ఉన్న సభ్యులు అందరికీ అవగాహన కల్పించాలన్నారు. వ్యక్తిగత సంఘము, గ్రామ సంఘం అవసరాలు ప్రాధాన్య క్రమంలో తీసుకొని, ఆమలు చేయుటకు కావలసిన అవకాశాలను చర్చించి, జీవనోపాదులు అభివృద్ధి పొందేలా ప్రణాళిక తయారు చేసి అమలు చేయాలన్నారు. ముందుగా మండల సమైక్య కార్యాలయంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎంలు పి.నారాయణరావు, వి.విశ్వేశ్వర రావు, ఎల్.పద్మ, గ్రామ సంఘం అధ్యక్షులు, సీసీలు, వివోఏలు పాల్గొన్నారు.

# షూటింగ్‌లో గాయపడ్డ రాజశేఖర్.. ‘బైకర్’ వచ్చేదెప్పుడు?



సీనియర్ హీరో, స్టార్ నటుడు రాజశేఖర్.. ఇప్పుడు బైకర్ మూవీలో నటిస్తున్న విషయం తెలిసిందే. యువ కథానాయకుడు శర్వానంద్ లీడ్ రోల్‌లో రూపొందుతున్న ఆ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నారు. స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఆ మూవీకి అభిలాష్ కంకర దర్శకత్వం వహిస్తున్నారు. షూటింగ్‌ను కొన్ని నెలలుగా జరుపుతున్నారు. అయితే రీసెంట్‌గా షూటింగ్‌లో రాజశేఖర్ గాయపడినట్లు తెలుస్తోంది. యాక్షన్ సీన్ చిత్రీకరిస్తున్న సమయంలో జరిగిన ఓ ప్రమాదంలో ఆయన కాలి మడమకు తీవ్రమైన గాయమైందట. ముఖ్యంగా, మడమ ఎముక పలుచోట్ల పగిలినట్లు సమాచారం. దీంతో తీవ్ర నొప్పితో బాధపడ్డ ఆయనను ఆసుపత్రికి తరలించగా, ఆపరేషన్ తప్పదని వైద్యులు సూచించారు. కాలు మడమ భాగంలో బోన్ ఫ్రాక్చర్ కావడంతో ఆయన అత్యవసరంగా ఆపరేషన్ చేయించుకున్నారు. రెండు గంటలకు పైగా కొనసాగిన ఆపరేషన్‌లో ఆర్థోపెడిక్ బృందంతో రాజశేఖర్ సమన్వయం చేస్తూ పూర్తిగా సహకరించారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఇప్పుడు ఆయన ఆరోగ్యం మెరుగవుతున్నట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి. “గత వారం బైకర్ మూవీ షూటింగ్ సందర్భంగా ఓ ప్రమాదం జరిగింది. యాక్షన్ సీన్‌ను షూట్ చేస్తుండగా రాజశేఖర్ కాలికి తీవ్రంగా దెబ్బ తగి లింది. చీలమండలో పలు ఫ్రాక్చర్లు ఉన్నాయి. తీవ్రమైన నొప్పి ఇబ్బంది పెట్టినప్పటికీ ఆయన సర్జరీకి సహకరించారు. రెండు గంటల పాటు జరిగిన సర్జరీ సక్సెస్ అయింది” అని సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. రాజశేఖర్‌కు పూర్తిస్థాయి విశ్రాంతి అవసరమని వైద్యులు స్పష్టంగా సూచించారు. ముఖ్యంగా మడమను ఏ విధంగా కూడా అస్సలు కదిలించకూడదని, కనీసం మూడు వారాల నుంచి నాలుగు వారాల వరకు బెడ్ రెస్ట్ తప్పనిసరి అని తెలిపారట. దీంతో రాజశేఖర్ ఇప్పుడు విశ్రాంతి తీసుకుంటున్నారు. మళ్లీ జనవరిలో సెట్స్‌లో అడుగుపెట్టనున్నట్లు సమాచారం. అయితే ఆ ఘటన కారణంగా బైకర్ మేకర్స్ షూటింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది.

రాజశేఖర్ ఆరోగ్యమే ప్రధానంగా భావించి.. షూటింగ్ షెడ్యూల్‌ను మార్చుతున్నట్లు సమాచారం. ఆయన గాయం నుంచి కోలుకున్న వెంటనే సినిమా చిత్రీకరణను తిరిగి ప్రారంభించేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు ఇప్పుడు టాక్ వినిపిస్తోంది. నిజానికి.. బైకర్ మూవీ డిసెంబర్ 6వ తేదీన విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించారు. అనౌన్స్ కూడా చేశారు. కానీ ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని అందించేందుకు వాయిదా వేస్తున్నట్లు కొన్ని రోజుల క్రితం ప్రకటించారు. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపారు. ఆ తర్వాత రాజశేఖర్ గాయపడ్డారు. మరి బైకర్ మూవీ షూటింగ్ పూర్తి చేసుకుని ఎప్పుడు రిలీజ్ అవుతుందో వేచి చూడాలి.

# వారణాసి గ్లింప్స్‌పై సూపర్ హిట్ డైరెక్టర్ కామెంట్..!




సూపర్ స్టార్ మహేష్ రాజమౌళి కాంబినేషన్ లో వస్తున్న వారణాసి సినిమా గ్లింప్స్‌తోనే సెన్సేషన్ సృష్టించింది. సినిమా గురించి చిన్న హింట్ ఇస్తూ జక్కన్న చేసిన ప్లానింగ్ అంతా ఇంతా కాదు. రామోజీ ఫిల్మ్ సిటీ అంతా సూపర్ స్టార్ ఫ్యాన్స్‌తో నిండిపోయేలా ఈవెంట్‌ని గ్రాండ్ సక్సెస్ చేశారు. ఐతే మహేష్ వారణాసి గ్లింప్స్‌పై ఇప్పటికే చాలామంది డైరెక్టర్స్ రెస్పాండ్ అవ్వగా లేటెస్ట్‌గా సక్సెస్ మిషన్ అనిల్ రావిపూడి కూడా తన రెస్పాన్స్ చెప్పారు. వారణాసి గ్లింప్స్ చూసిన తర్వాత మహేష్‌కి కాల్ చేసి చాలాసేపు మాట్లాడానని అన్నారు అనిల్ రావిపూడి. గ్లింప్స్ అంత భారీగా ఉంటుందని తాను ఊహించలేదని అన్నారు. వారణాసి గ్లింప్స్‌లో ప్రతి షాట్ తనను షాక్ అయ్యేలా చేసిందని అన్నారు అనిల్ రావిపూడి. ప్రతి ఫ్రేం టైం ట్రావెలర్‌గా అనిపించిందని.. రాజమౌళి నుంచి మరో అద్భుతమైన ప్రాజెక్ట్ వస్తుందని గ్లింప్స్ చూశాక అర్థమైందని అనిల్ రావిపూడి అన్నారు. రాజమౌళి ఈ సినిమా మొదలు పెట్టి ఏడాది అవుతున్నా సినిమా గురించి ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదని ఫ్యాన్స్ కాస్త అప్సెట్ అయ్యారు. కానీ నవంబర్ 15న గ్లోబ్ ట్రొట్టర్ ఈవెంట్‌గా వారణాసి టైటిల్ రివీల్ ఇంకా గ్లింప్స్ రిలీజ్ చేసి ఫ్యాన్స్‌ని ఖుషి చేశారు. ఈ ఈవెంట్ కోసం ఫ్యాన్స్ అందరికీ పాస్ పోర్ట్ అందించారు. ఆ రోజంతా కూడా సూపర్ ఫ్యాన్స్ ఒక రేంజ్‌లో హంగామా చేశారు. ఇక టైటిల్ గ్లింప్స్‌తో సినిమాపై మరింత అంచనాలు పెంచుకున్నారు ఫ్యాన్స్. రాజమౌళి వారణాసి సినిమా 2027 సమ్మర్ రిలీజ్ కి ప్లాన్ చేస్తున్నారు. రాజమౌళి సినిమా కాబట్టి అది చెప్పిన డేట్‌కి వస్తుందని చెప్పడం కష్టం. ఈసారి వారణాసి సినిమాను ఇంటర్నేషనల్ వైడ్ రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నారు జక్కన్న.


అంతేలాదు ఆర్.ఆర్.ఆర్ కేవలం సాంగ్ ఒక్కటే ఆస్కార్ తెచ్చుకోగా వారణాసి సినిమా అన్ని విభాగాల్లో నామినేట్ అయ్యేలా టార్గెట్ చేస్తున్నారు. వారణాసి సినిమాలో మహేష్ సరసన ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తుంది. సినిమాలో మలయాళ స్టార్ పృథ్వీరాజ్ కుమారన్ కుంభ రోల్‌లో నటిస్తున్నారు. వారణాసి సినిమాకు కీరవాణి మ్యూజిక్ మరో హైలెట్ కానుంది. ఈ సినిమా గ్లింప్స్‌లోనే తెర మీద రుద్ర పాత్రలో మహేష్ బాబు నటనకు బిజిఎం కూడా నెక్స్ట్ లెవెల్ అందించారు కీరవాణి. అంతేకాదు సినిమా నుంచి రిలీజైన సంచారి సాంగ్ సూపర్ హిట్ కాగా కుంభ సాంగ్ కూడా ట్రెండింగ్‌లో ఉంది.

# రామ్, భాగ్యశ్రీ. ఎన్నిసార్లు చెప్పినా మళ్లీ



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని, యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే రిలేషన్ షిప్‌లో ఉన్నారని కొన్ని నెలలుగా ఊహాగానాలు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. వీరిద్దరూ కలిసి ఇటీవల ఆంధ్రా కింగ్ తాలూకా మూవీలో నటించగా.. ఆ సినిమా షూటింగ్ సమయంలోనే రామ్, భాగ్యశ్రీ మధ్య సాన్నిహిత్య సంబంధం పెరిగిందని రూమర్స్ స్ప్రెడ్ అవుతున్నాయి. అది కాస్త స్నేహబంధం దాటి.. ప్రేమగా మారిందని పుకార్లు వినపడుతూనే ఉన్నాయి. ఇప్పటికే ఆ విషయంపై రామ్, భాగ్యశ్రీ రెస్పాండ్ అయ్యారు. ఆంధ్రా కింగ్ తాలూకా ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూల్లో స్పందించారు. తామిద్దరం మంచి ఫ్రెండ్స్ మాత్రమేనని స్పష్టం చేశారు. కేవలం ఫ్రెండ్ షిప్ రిలేషన్ ఉందని చెప్పారు. తాను సినిమా కోసం లవ్ సాంగ్ రాసినప్పటి నుంచి రూమర్స్ మొదలయ్యాయని రామ్ తెలిపారు. భాగ్యశ్రీపై ప్రేమతో పాట అంత బాగా రాశానని అనుకుంటున్నారని, కానీ హీరోయిన్‌ను సెలెక్ట్ చేయకముందే రాశానని చెప్పారు. ఆ తర్వాత ఆయన అంటే తనకు ఎంతో గౌరవమని, అంతకు మించి తమ మధ్య ఎలాంటి సంబంధం లేదని భాగ్యశ్రీ పేర్కొన్నారు. అంత క్లారిటీగా ఇద్దరూ చెప్పినా కూడా.. నెట్టింట మాత్రం రిలేషన్ షిప్ ఉందని రూమర్లు ఇంకా చక్కర్లు కొడుతూనే ఉన్నాయి. త్వరలోనే ఇద్దరూ ప్రకటిస్తారని కొందరు నెటిజన్లు ఇప్పుడు కూడా సోషల్ మీడియాలో పుకార్లను స్ప్రెడ్ చేస్తున్నారు. వారిద్దరి మధ్య కెమిస్ట్రీని ఉదాహరణగా చూపిస్తూ.. రూమర్లను వైరల్ చేస్తున్నారు. నిజానికి ఆంధ్రా కింగ్ తాలూకా మూవీ.. నవంబర్ 28వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆడియన్స్‌తోపాటు విమర్శకులను సినిమా ఆకట్టుకోగా.. బాక్సాఫీస్ వద్ద మాత్రం అనుకున్న స్థాయిలో వసూళ్లు సాధించలేదు. రీసెంట్ గా సడెన్‌గా నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ 2 తాండవం వాయిదా పడడంతో రామ్, భాగ్యశ్రీ మూవీకి మరో ఛాన్స్ వచ్చినట్లైంది. దీంతో వారిద్దరూ సినిమా పోస్ట్ ప్రమోషన్స్‌లో పాల్గొన్నారు. అందుకు సంబంధించిన ఈవెంట్స్‌లో రామ్, భాగ్యశ్రీ.. నవ్వుతూ సరదాగా కనిపించారు. ఫ్రెండ్స్ అంటే క్లోజ్‌గా ఉండకూడదా.. సరదాగా ఉండకూడదా.. ఉండొచ్చు కదా.. కానీ దాన్ని బేస్ గా తీసుకుని వారి మధ్య సమ్ థింగ్ సమ్ థింగ్ నిజంగా ఉందని కామెంట్లు పెడుతున్నారు. ఎన్నిసార్లు క్లారిటీ ఇస్తున్నా కూడా రూమర్స్ స్ప్రెడ్ చేస్తూనే ఉన్నారు. అవి మరెప్పుడు ఆగుతాయో వేచి చూడాలి.

# విజనరీ ‘ప్రేరణ’.. పాన్ ఇండియా చిత్రాలతో దూకుడు





విజనరీ నిర్మాత ప్రేరణ అరోరా.. తెలుగు సినీ ప్రియులకు కూడా సుపరిచితురాలు. రీసెంట్‌గా యంగ్ హీరో సుధీర్ బాబు నటించిన జటాధర మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చారు. సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఆ సినిమా ప్రొడక్షన్ వాల్యూస్‌తో అందరినీ ఆకట్టుకున్నారు. అయితే జటాధర కన్నా ముందు అనేక హిందీ సినిమాల నిర్మాణంలో భాగమయ్యారు. 2016లో క్రిఆర్జ్ ఎంటర్టైన్మెంట్స్ నిర్మాణ సంస్థను మొదలుపెట్టిన ప్రేరణ ఆరోరా.. అదే ఏడాది రుస్తం మూవీని రూపొందించారు. సురేష్ దేశాయ్ దర్శకత్వంలో క్రైమ్ థ్రిల్లర్‌గా ఆ సినిమాను నిర్మించారు. ఆ తర్వాత ఏడాదిలో టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ మూవీని నిర్మించిన ప్రేరణ.. 2018లో వరుస చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. అనేక సినిమాలకు నిర్మాణ భాగస్వామిగా బాధ్యత వహించారు. సామాజిక ఇతివృత్తాలతో కూడిన పలు సినిమాలకు సహనిర్మాతగా వ్యవహరించి బాక్సాఫీస్ వద్ద విజయాలు అందుకున్నారు. ప్యాడ్ మ్యాన్, కేదార్ నాథ్, పరీ, పర్మాణు: ది స్టోరీ ఆఫ్ పోఖ్రాన్, బట్టి గుల్ మీటర్ చాలు వంటి ఇతర ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రేరణ అరోరా పాలుపంచుకున్నారు. తద్వారా బాలీవుడ్‌లో మంచి విజన్ ఉన్న యంగ్ ఉమెన్ ప్రొడ్యూసర్‌గా పేరు సంపాదించుకున్నారు. తనకంటూ ప్రత్యేక గుర్తింపు కూడా బీటౌన్‌లో సొంతం చేసుకున్నారు. ఆమె చేస్తున్న ప్రాజెక్టులు కేవలం హిందీ చిత్రసీమలోనే కాక.. సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో కూడా విశేష ఆదరణ అందుకుని సత్తా చాటుతున్నాయి. ఇటీవల సుధీర్ బాబు జటాధర సినిమాతో తెలుగు చలనచిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఆమె.. ఇప్పుడు కొత్త పాన్ ఇండియా అడ్వెంచర్ మూవీని అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. నిజానికి.. ప్రేరణ ఆరోరా పుట్టిన రోజు నేడు. అందుకే కొత్త ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించారు. అయితే ఆ సినిమాను ప్రముఖ జీ స్టూడియోస్ తో కలిసి నిర్మిస్తున్నారు. ఉమేష్ కుమార్ బన్సాల్, శివిన్ నారంగ్‌తో సంయుక్తంగా రూపొందించనున్నారు ప్రేరణ. అలా జీ స్టూడియోస్‌తో కలిసి క్రిఅర్జ్ ఎంటర్టైన్మెంట్స్ పై మూడో మూవీ తీయనున్నారు.

ఇప్పటికే జీ స్టూడియోస్, క్రిఅర్జ్ ఎంటర్టైన్మెం ట్స్ సంయుక్తంగా రుస్తం, జటాధర చిత్రాలు రూపొందించగా.. ఇప్పుడు మరో సినిమా నిర్మించనుంది. జటాధర పాన్ ఇండియా మూవీనే కాగా.. ఇప్పుడు కూడా పాన్ ఇండియా చిత్రమే రూపొందించనుండడం గమనార్హం. త్వరలో మరిన్ని మంచి చిత్రాలతో ఆడియన్స్ ముందుకు రాబోతున్న ప్రేరణకు తుపాకి తరఫున ఆల్ ది బెస్ట్‌తో పాటు బర్త్ డే విషెస్ కూడా.

# యూరియా పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు : కలెక్టర్ హిమాన్షు శుక్ల




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** యూరియాను సరఫరా చేయాలని, యూరియా పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. శనివారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఎంపిడివోలు, తహశీల్దార్లు, వ్యవసాయశాఖ అధికారులతో జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణితో కలిసి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా పంపిణీలో ఎవరైనా సరే అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతు సేవాకేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ కోపరేటివ్ సొసైటీల ద్వారా అవసరమైన యూరియాను రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు. బహిరంగ మార్కెట్లోని ఏజెన్సీల్లో అదనంగా యూరియా నిల్వలు చేయడం, అధిక ధరలకు విక్రయించినట్లు గుర్తిస్తే కేసుల నమోదు చేస్తామన్నారు. విజిలెన్స్, ఇంటలిజెన్స్ అధికారులు నిరంతరం నిఘా వుంచాలని ఆదేశించారు. వ్యవసాయ అధికారులు, తహశీల్దార్లు తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగుమందులు అన్నింటిని సకాలంలో అందించడమే ప్రధానలక్ష్యంగా పనిచేయాలని సూచించారు.

**ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సాదా బైనామా సమస్యలను పరిష్కరించాలి : కలెక్టర్**

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోను పూర్తిగా అర్థం చేసుకుని సాదాబైనామా భూముల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ హిమాన్షుశుక్ల ఆదేశించారు. ఈ మేరకు వీడియో కాన్ఫరెన్సులో సాదాబైనామా భూముల విషయమై తహశీల్దార్లతో కలెక్టర్ చర్చించారు. క్షేత్రస్థాయిలో విచారించి, వీలైనంత వరకు హక్కుదారులకు న్యాయం జరిగేలా సత్వరమే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా వున్నాయన్న కలెక్టర్, సంక్రాంతి తర్వాత రెవెన్యూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రెవెన్యూ అధికారులందరూ ఒక గ్రామాన్ని టార్గెట్ చేసుకుని ఈనెలాఖరులోగా ఆ గ్రామంలో ఉన్న రెవెన్యూ సమస్యలను అధ్యయనం చేసి, మొదటి చిన్న సమస్య నుంచి పెద్ద సమస్య వరకు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కనీసం 60శాతం మేర ఆ గ్రామంలో రెవెన్యూ సమస్యల పరిష్కరించాలనే లక్ష్యం నిర్దేశించుకుని పనిచేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ, జిల్లా వ్యవసాయాధికారి సత్యవేణి, మార్క్‌ఫెడ్ డిఎం పవన్‌కుమార్, ఇంటిలిజెన్స్ సిఐ నరసింహారావు, సివిల్‌సప్లయిస్ అధికారులు లీలారాణి, అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల సంక్షేమానికే నా మొదటి ప్రాధాన్యత : మంత్రి పొంగూరు నారాయణ

**- కార్యకర్తల అండగా ఉంటు, పురిటి గడ్డ రుణం తీర్చుకుంటా మంత్రి - మా నాన్నకు సాయం చెయ్యడమే తెలుసు : కుమార్తె షరిణి- గోమతి నగర్ క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగిన విధి వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ కార్యక్రమం - ఈరోజు 303 మంది కార్యకర్తలకు 76 లక్షల 25 వేల రూపాయలు చెక్కులు పంపిణీ**






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కార్యకర్తలకు అండగా ఉంటూ పురిటి గడ్డ రుణం తీర్చుకుంటామని రాష్ట్ర పురపాలక పట్టణాభి వృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు.. ఈ సందర్భంగా నెల్లూరులోని గోమతి నగర్ క్యాంపు కార్యాలయంలో సిటీ నియోజకవర్గానికి సంబంధించి కార్యకర్తల సంక్షేమనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం పండుగలా నిర్వహించారు.తెలుగు దేశం పార్టీ కాయకర్తలతో క్యాంపు కార్యాలయం పసుపుమయంగా మారింది..కార్యకర్తల సంక్షేమానికి ఎల్లప్పుడూ మొదటి ప్రాధాన్యత ఇస్తానని మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. వారి సంక్షేమానికి నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఏడాదికి 10 కోట్ల సొంత నిధిని కార్యకర్తల సంక్షేమానికి కేటాయించిన ఆయన ఈ విడతలో 303 మందికి ఒక్కొక్కరికి 25వేల వంతున కుమార్తె షరణీతో కలిసి 76,25 లక్షల రూపాయల చెక్కులను కార్యకర్తలకు అందజేశారు. ఇప్పటివరకు మూడు కోట్ల అరవై లక్షల రూపాయల చెక్కులను అందజేసినట్లు వెల్లడించారు. తనను గెలిపించిన ప్రజలకు.. తనను భుజాలపై మోసే కార్యకర్తలకు జీవితాంతం రుణపడి ఉంటానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. చెక్కులు అందుకున్న కార్యకర్తలందరూ మంత్రి పొంగూరు నారాయణతో పాటు.. షరణి కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలను గుర్తుపెట్టుకుని.. వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న ఏకైక మంత్రి పొంగూరు నారాయణ అంటూ వారు కొనియాడారు. కుటుంబ సభ్యుల సహకారంతో కార్యకర్తలకు ఆర్థిక సాయం చేస్తున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు... అనంతరం మంత్రి కుమార్తె షరిణి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా నిరుపేదలకు సాయం చేయడం మాత్రమే తన తండ్రికి తెలుసని.. పేదరికంలో పుట్టాడు కాబట్టే.. నిరుపేదల కష్టాలను తెలుసుకున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తన తండ్రి తూచా తప్పకుండా నెరవేరుస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలతో పాటు.. ఇవ్వని హామీలను సైతం నెరవేరుస్తున్నారని వెల్లడించారు. 2024 ఎన్నికల ప్రచారంలో తన తండ్రిని చాలా మంది చాలా మాటలన్నారనీ ఆమె గుర్తు చేశారు. మా నాన్న మాటల మనిషి కాదని.. చేతల మనిషని ఇప్పుడు అందరికీ అర్థం అవుతుందన్నారు. నెల్లూరు నగరాన్ని మెట్రోపాలిటిన్ సిటీ చేసే దిశగా ముందుకు సాగుతున్నారనీ వివరించారు. ఎన్నికల ఫలితాలు రాకముందే కార్యకర్తలకోసం ఏడాదికి పదికోట్లు కేటాయించాలని తమ కుటుంబం నిర్ణయించిందన్నారు. ఆ నిధి నుంచి కార్యకర్తలకు విడతవారిగా సహాయం చేస్తున్నామనీ అన్నారు. దేశంలో ఏ నేతా చేయని విధంగా కార్యకర్తలకు తన తండ్రి ఆర్థికసహాయం చేస్తున్నారని అన్నారు. తోపుడు బండ్లు, సహాయనిధి చెక్కులు తీసుకొన్న వారి కళ్ళలో ఆనందం చూస్తే సంతోషంగా ఉందన్నారు. 63 మందికి తన చేతులు మీదగా తోపుడు బండ్లు, ఇస్త్రీ బండి, 7 ట్రై సైకిల్స్ పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. చిన్నతనంలో తన తండ్రి ఎన్నో ఇబ్బందులు పడ్డారని, కష్టపడి చదివి ఈ స్థాయికి వచ్చారనీ అన్నారు. పుట్టిన గడ్డ ఋణం తీర్చుకోవాలని నాయకుదయ్యారని శరణి తెలిపారు. అందరి మన్ననలు పొందుతూ ప్రజానాయకుడిగా ముందుకు సాగుతున్నారనీ ఆమె మీడియాకు తెలిపారు.

నాన్నగారి బాటలో నడుస్తూ మీకందరికీ అండగా ఉంటానని శరణి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, రాష్ట్ర వెర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిరా శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, డివిజన్ కు సంబంధించిన కార్పొరేటర్లు ప్రెసిడెంట్లు టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బి. ఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతి కార్యక్రమం

**- సమాజంలో గల సామాజిక రుగ్మతలను పారద్రోలడానికి పాటుబడిన మహోన్నతుడు బి.ఆర్.అంబేద్కర్ : మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య**



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరం వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో బాబా సాహెబ్ భీమ్ రావు అంబేద్కర్ 69వ వర్ధంతి కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే, పార్టీ సీనియర్ నాయకులు బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా "బొత్స" పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారని అన్నారు. సమాజంలో ఉన్న సామాజిక రుగ్మతలను పారద్రోలడానికి అంబేద్కర్ ఎంతగానో పాటుపడ్డారని బొత్స అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశ రాజ్యాంగాన్ని నిర్మించిన మహోన్నత వ్యక్తి బి.ఆర్.అంబేద్కర్ అని మాజీ ఎమ్మెల్యే బొత్స కొనియాడారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గార తవుడు, మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ, మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకట రావు, వైకాపా నాయకులు బెల్లాన త్రినాధరావు, మాజీ ఎంపీటీసీ ఆల్తి రామనాయుడు, వీవర్స్ వింగ్ అధ్యక్షులు ఊజ్జారి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పైడుపునాయుడు, సన్యాసిరావు, రాజు, ఆదాడ గోపి, బూర్లె కృష్ణ పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతి



**అమలాపురం, (రాజధాని వార్తలు):** త్రి రత్న బుద్ధ విహార్ అమలాపురంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్. బి.ఆర్.అంబేద్కర్ 69.వ వర్ధంతి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి గొల్లపల్లి సూర్యారావు పాల్గొని నివాళులు అర్పించారు. డి. బి.లోక్ అధ్యక్షతన చైర్మన్ నాగాబత్తుల ప్రసాదరావు సమక్షంలో భారీ ఎత్తున బుద్ధిష్టులు అంబేద్కరియులు పాల్గొని నివాళులు అర్పించారు త్రి రత్న బుద్ధ విహార్ 17వ వార్షికోత్సవం పురస్కరించుకొని కార్యక్రమాలు జరిగినాయి. ఈ కార్యక్రమంలో పెనుమాల చిట్టిబాబు. బాలరావి. ధోనీపాటి నాగేశ్వరరావు కోడూరి రామ్మూర్తి శ్యామలరావు పెయ్యల శ్రీనివాస్, మల్లేశ్వరరావు భానోజీరావు గెడ్డం భాస్కరరావు. రేవు ఈశ్వరరావు మొదలగువారు పాల్గొన్నారు.

# సత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు అగ్నివీర్‌కు ఎంపిక



**విజయనగరం, (రాజధాని వార్తలు):** సత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థులు భారత సైన్యంలో అగ్నివీర్ జనరల్ డ్యూటీ మరియు టెక్నికల్‌కు ఎంపికైన 11 మంది విద్యార్థులను అభినందన. ఈ కార్యక్రమంలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, ఎన్ సి సి ఆఫీసర్లు కెప్టెన్ ఎం సత్య వేణి, లెఫ్టినెంట్ ఎం ఉదయ్ కిరణ్ ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ బి సూరప నాయుడు, ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. అగ్నివీర్ నియామక ప్రక్రియలో పట్టుదల, క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం ప్రదర్శించి విజయాన్ని సాధించిన విద్యార్థులు కాలేజీకి గర్వకారణమని వారు పేర్కొన్నారు. శశి భూషణ రావు మాట్లాడుతూ అగ్నివీర్‌కు ఎంపిక కావడం కేవలం ఒక ఉద్యోగం కాదుఇది దేశసేవకు అమోఘ అవకాశం. మా కాలేజ్ విద్యార్థులు ఈ స్థాయిని చేరడం మా సంస్థకు గొప్ప గౌరవం. మీలో ప్రతిఒక్కరూ క్రమశిక్షణ, ధైర్యం, సేవాభావం కలిగి ఉన్నారు. ఈ ప్రయాణం మీకు మరెన్నో అవకాశాలకు మార్గం చూపుతుంది. మీ కుటుంబాలు, మీ అధ్యాపకులు, మీ కష్టయిమూడూ కలిసే ఈ విజయాన్ని సాధ్యమయ్యాయి. దేశ రక్షణలో మీ పాత్ర శ్లాఘనీయం అని అన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అగ్నివీర్ ఎంపిక ప్రక్రియలో మా విద్యార్థులు ప్రతిభ చూపడం మా కళాశాలకు కు గర్వకారణం. మీరు సాధించిన ఈ విజయం భవిష్యత్తులో మరింత ఎత్తులకు తీసుకెళ్తుంది. క్రమశిక్షణ, శ్రమ, మానసిక ధైర్యంఇవన్నీ కలిసి మీరు దేశ రక్షణ బాటలో నడుస్తున్నారు. సత్య డిగ్రీ కళాశాల తరఫున మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు అని అన్నారు.

# వైకల్యం శరీరానికే మనసుకు కాదు...ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

**సామర్లకోట (రాజధాని వార్తలు):** వైకల్యం అనేది శరీరానికి మాత్రమే ఉంటుందని, మనసుకు కాదని అందువలన వైకల్యం ఉన్న పిల్లల పట్ల చిన్న చూపు వద్దని ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, తదితరులు అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని స్థానిక సామర్లకోట భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ పి పుల్లయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ బొబ్బరోడ సత్తిబాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ సమాజంలోని దివ్యాంగుల హక్కులు, గౌరవాన్ని ప్రోత్సహించడం, వారి శ్రేయస్సు గురించి అవగాహన పెంచడం ఈ దినోత్సవ లక్ష్యం అన్నారు. వారిని సమాజంలో మిగిలిన ఆరోగ్య వంతమైన పిల్లలతో సహా సమానంగా తీర్చి దిద్దేందుకు భవిత కేంద్రల ద్వారా విశేష సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. తల్లిదండ్రులు సైతం భవిత సిబ్బందికి పూర్తి సహకారాన్ని అందించాలన్నారు. అనంతరం లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ నాయకులు, పలు సేవా సంస్థల ప్రతినిధులు పలు పోటీల్లో ప్రతిభను కనపరచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అంగవైకల్యం శరీరానికి మాత్రమే నని, ఆలోచ నలకు కాదని నినాదం వారి ఆత్మవిశ్వాసానికి, సంకల్పానికి ప్రత్యేకగా నిలుస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఐఈఆర్టీలు మోకా అనిత, పద్మా వతి, ఐ జీవివి ప్రసాద్, బేబీ నాగేశ్వరిలు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా రవాణా స్టైఫండ్, ఎస్కార్ట్ అలవెన్స్, స్కాలర్షిప్, ఫిజియోథెరపీ వంటి సౌకర్యాలతో పాటు పదో తరగతిలో అనేక రాయితీలు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు అమలాకంటి శ్రీనివాస్‌రావు రోటరీ క్లబ్ అధ్య క్షులు ఎన్ సత్యనారాయణ, మన పెద్దాపురం ట్రస్ట్ నాయకులు నరేంద్ర, జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ, హెచ్‌ఎంలు తోటకూర సాయిరామ్ కృష్ణ, ఎస్ శ్రీదేవి, ఎమ్ రఫీ, లయన్స్, రోటరీ క్లబ్ సభ్యులు, భవిత సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు గారి లాంటి కెప్టెన్ నాయకత్వంలో పని చేయడం మా అదృష్టం

**- వైభవంగా నెల్లూరు సిటీ కూటమి నాయకుల ఆత్మీయ సమావేశం - సిటీ నియోజకవర్గ అభివృద్ధికి కలిసి పనిచేస్తున్నాం - సమర్థవంతమైన నాయకత్వంలో రాష్ట్రం పదిలం - సీఎం చంద్రబాబు పాలనలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాం - ప్రజలకు నిస్వార్థంగా సేవ చేసేవారు వేమిరెడ్డి దంపతులు - ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్**














**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ కూటమి నాయకులు, కార్యకర్తలు సందడిగా మారింది. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మల సహకారంతో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో నెల్లూరు సిటీ నియోజకవర్గానికి సంబంధించి ఆత్మీయ సమావేశం జరగగా.. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలిరాగా.. సభా ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ముందుగా జిల్లా పార్టీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ తదితరులతో కలిసి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పొంగూరు నారాయణ గార్లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు సిటీ కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. దివ్యాంగులకు సహాయార్థం తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రై సైకిళ్లు అందజేయడం సంతృప్తిని ఇస్తోందన్నారు. ఇప్పటికే మంత్రి నారాయణ ఇప్పటికే కొందరికి ట్రై సైకిళ్లు అందజేశారని చెప్పారు. ఇప్పటివరకు నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో 1050 మంది దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లు అందజేశామన్నారు. అలాగే వాటి మెయింటెనెన్స్ కూడా తమ ఫౌండేషన్ చూస్తుందని స్పష్టం చేశారు. దివ్యాంగులు ఎక్కడా ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు. ఇదే విషయాన్ని ట్రై సైకిళ్ల సప్లయర్స్ కూడా తెలియజేశామన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 200 వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేశామని, 2016లో పెట్టిన ప్లాంట్లు కూడా నిరంతరంగా పనిచేస్తున్నాయన్నారు. విపిఆర్ విద్య పాఠశాలను పెట్టి పేదల పిల్లలకు ఉచితంగా చదువు చెప్పిస్తున్నట్లు పేర్కొన్నారు. నిత్యం ఎనర్జిటిక్‌గా పనిచేసే మంత్రి నారాయణలాంటి వ్యక్తి జిల్లాకు ఉండటం అదృష్టమన్నారు. సీఎం చంద్రబాబు అమరావతి రాజధాని బాధ్యతను నారాయణపై పెట్టారని, ఆయన దాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకువెళుతున్నారన్నారు. ఇటీవల వర్షాలతో పనుల్లో జాప్యం జరిగిందని, త్వరలోనే అన్నీ పూర్తవుతాయన్నారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో అండర్ గ్రౌండ్ పనులు పూర్తి చేస్తేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. మంచి నాయకత్వంలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేష్‌లు నిరంతరం పని చేస్తున్నారని చెప్పారు. సీఐఐ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చారని, సీఎం చంద్రబాబు దాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ.. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న తన నియోజకవర్గం పరిధిలో 84 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేయడం వ్యక్తిగతంగా సంతోషంగా ఉందన్నారు. విపిఆర్ దంపతులు రాజకీయాల్లోకి రాకముందే సేవామార్గంలో ఉన్నారన్నారు. దాదాపు 200 వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారన్నారు. విపిఆర్ నేత్ర ద్వారా గ్రామీణ ప్రజల కంటి చూపును మెరుగుపరుస్తున్నారని, జిల్లాలో అన్ని ఆలయాల అభివృద్ధిలో వారి భాగస్వామ్యం ఉందన్నారు. రాజకీయాల్లోకి వచ్చి డబ్బు సంపాదించాలనే ఆలోచన లేనివారని కొనియాడారు. తన నియోజక వర్గంలో ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఉండటం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. 53, 54 డివిజన్లలో పేదలు అధికంగా ఉన్నారని, మైనారిటీల శాతం అధికంగా ఉందని, అక్కడ షాదీ మంజిల్ నిర్మాణానికి చెరో యాభై లక్షలు విరాళంగా ఇచ్చామన్నారు. షాదీ మంజిల్‌కి సొంత నిధులిచ్చిన ఎంపీ వేమిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. విఆర్ స్కూల్‌ను కూడా ఎంతో ఉన్నత ఆశయంతో తీర్చిదిద్దామన్నారు. ఎంపీ వేమిరెడ్డి సహకారంతో నగరంలోని ఆర్ఎస్ఆర్ పాఠశాల అద్భుతంగా తయారవుతోందని చెప్పారు. తానైనా, ఎంపీ వేమిరెడ్డి అయినా.. మాట ఇస్తే తప్పకుండా నెరవేర్చుతామని అన్నారు. చింతారెడ్డిపాలెం వద్ద అండర్ ఏర్పాటుకు కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి మంజూరు చేయించారని అన్నారు. టెండర్లు కూడా పూర్తవుతాయన్నారు. ఎన్టీఆర్ నగర్ వద్ద కూడా అండర్ పాస్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడి సహకారంతో ఎంపీతో కలిసి నెల్లూరిని మోడల్ సిటీగా మారుస్తామన్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. సేవకు మరోరూపం విపిఆర్ దంపతులని అన్నారు. ఉదయగిరిలాంటి మెట్ట ప్రాంతాల్లో అమృత ధార ప్లాంట్లు పెట్టి దాహార్తి తీర్చారన్నారు. విపిఆర్ దంపతులతో సహవాసం.. మన జీవితాల్లో మంచి మార్పులు తెస్తుందని చెప్పారు. సమాజానికి ఏం చేయాలి అని ఆలోచించేవారని చెప్పారు. ప్రజలకు సేవ ఎలా చేయాలి అని తపించేవారు వేమిరెడ్డి దంపతులు, మంత్రి నారాయణ అని కొనియాడారు. ఇలాంటి వారు రాజకీయాల్లో అరుదని చెప్పారు. కోవూరు నియోజకవర్గంలో మహిళలకు ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి భయం పోగొట్టారన్నారు. విపిఆర్ నేత్ర ద్వారా ప్రజలకు కంటి సంరక్షణ చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. క్రమశిక్షణ గల పార్టీలో ఉన్నామని, మళ్లీ వచ్చే నాటికి మరింత అభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం విపిఆర్ నేత్ర సేవలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు చేర్చుతున్న డాక్టర్ కృష్ణ ప్రసాద్‌ని, విపిఆర్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ శంకర్‌ని వేమిరెడ్డి దంపతులు, మంత్రి నారాయణ శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కప్పిర శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ తహసిన్, నగర అధ్యక్షుడు మామిడాల మధు, టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి, జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గుడి హరిరెడ్డి, సిటీకి సంబంధించిన కార్పొరేటర్లు, టిడిపి, జనసేన ముఖ్య నేతలు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు నగర నియోజకవర్గం 6వ డివిజన్‌లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి వెల్లువెత్తిన ప్రజా మద్దతు

**- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎదురొచ్చి సంతకాలు చేసిన ప్రజలు - కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరిస్తూ కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజలకు వివరించిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి**






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు 6వ డివిజన్ పప్పుల వీధిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక వైసీపీ నేతలతో కలిసి వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి చీదేళ్ళ కిషన్ పాల్గొని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమ కార్యక్రమాన్ని గురించి వివరించి ప్రజల చేత సంతకాలు చేయించారు. అనంతరం ఆ ప్రాంతంలో పలు వాణిజ్య దుకాణాలకు వెళ్ళి మెడికల్ కళాశాలలు ప్రైవేటు పరం చేయడం వలన జరిగే నష్టాలను ప్రజలకు వివరించి ప్రజల నుంచి సంతకాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి జగన్మోహన్ రెడ్డి పరిపాలన ప్రారంభమయ్యే వరకు ఈ రాష్ట్రంలో కేవలం 11 మెడికల్ కళాశాలలు మాత్రమే ఉంటే.. ఏకంగా 17 నూతన మెడికల్ కళాశాలలను ఈ రాష్ట్రానికి తీసుకు వచ్చిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డిదన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు తన పాలనలో ఒక్క మెడికల్ కళాశాలను కూడా ఈ రాష్ట్రానికి తీసుకు రాలేక పోయారని అన్నారు. ఈరోజు జగన్మోహన్ రెడ్డి తీసుకు వచ్చిన మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ చంద్రబాబు నాయుడు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేటు వ్యక్తులకు అప్పనంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలను చంద్రబాబు నాయుడు దారా దత్తం చేయడం ప్రజాధనాన్ని దోపిడీ చేయడమేనన్నారు. దీనిని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాలు సేకరించి ప్రభుత్వం తీసుకున్న కుట్రపూరిత నిర్ణయాన్ని వెనక్కు తీసుకునేలా వైఎస్ఆర్సిపి పోరాటం చేస్తుందని తెలిపారు. అందులో భాగంగా ఈరోజు నెల్లూరు నగర నియోజకవర్గం 6వ డివిజన్ పప్పుల వీధిలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దిశగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణలో ఉత్సాహంగా పాల్గొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి కనువిప్పు కలిగించి మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ జరగకుండా వైఎస్ఆర్సిపి అడ్డుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు మంచికంటి శ్రీనివాసులు, స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజేంద్ర రెడ్డి, పబ్బిశెట్టి శ్రీనివాసులు, అడపా శ్రీధర్, తానేషా, శ్రీహరి, మాదాల నరేంద్ర, ఎస్ సురేష్ రెడ్డి, సజ్జా చందు, అశోక్ రెడ్డి, నాగమణి, సుభాషిని, బాలరాజు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీశైల మల్లన్న స్వర్ణ రథోత్సవంలో వేమిరెడ్డి కోటారెడ్డి




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** శ్రీశైలం మల్లికార్జున స్వామి వారి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శ్రీశైలంలో స్వామి వారికి బంగారు రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆదివారం జరిగిన ఈ రథోత్సవంలో శ్రీశైల దేవస్థానం బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు వేమిరెడ్డి కోటా రెడ్డి పాల్గొని స్వర్ణ రథాన్ని లాగారు. మాడ వీధుల్లో స్వామి వారు భక్తులకు స్వర్ణ రథంపై నుంచి దర్శనభాగ్యం అందించారు. శ్రీశైలం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు స్వర్ణ రథం అందించిన విషయం తెలిసిందే. స్వామి వారి సేవలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని కోటారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

మల్లన్న ఆసీసులతో ప్రజలు సంతోషంగా ఉం డాలని ఆకాంక్షించారు. రథోత్సవంలో శ్రీశైల దేవస్థానం ఈవో, బోర్డు సభ్యులు, టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 69వ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్‌కి ఘన నివాళి

**అయినవిల్లి, (రాజధాని వార్తలు):** డా.బి.ఆర్.అంబేద్కర్ 69వర్ధంతి సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమములో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, జి.వి.సరోవర్, ఎంపీపీ, మండల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞాననందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎడ్యానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్లు 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన కూటమి అభ్యర్థి బాణావత్ హరిశ్చంద్ర నాయక్




**భద్రాచలం, (రాజధాని వార్తలు):** రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ భీమ్‌రావు రామ్‌జీ అంబేద్కర్ గారి 69వ వర్ధంతి సందర్భంగా, టీడీపీ–జనసేన బలపరుస్తున్న బీజేపీ కూటమి అభ్యర్థి బాణావత్ హరిశ్చంద్ర నాయక్ భద్రాచలం అంబేద్కర్ సెంటర్ వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డా. అంబేద్కర్ రాజ్యాంగ దృష్టి దేశ ప్రజాస్వామ్యానికి శాశ్వత పునాది. ఆయన చూపిన సమానత్వం, సామాజిక న్యాయం, విద్యా సాధికారత మార్గాలను అనుసరించటం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత. ప్రత్యేకించి దళితులు, గిరిజనులు, పేదలు అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు అంబేద్కర్ భావజాలమే మా కార్యాచరణకు మార్గదర్శకం" అని తెలిపారు. అలాగే భద్రాచలంలో సామాజిక న్యాయం, విద్య, ఉపాధి అవకాశాల పెరుగుదలను లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీజేపీ–టీడీపీ–జనసేన నాయకులు కుంజా ధర్మా, తాళ్లూరి చిట్టిబాబు, అబ్బినేని శ్రీనివాస్, కుంజా సంతోష్, ముత్యాల శ్రీనివాస్, ములిశెట్టి రాంమోహన్ రావు, నిడదవోలు నాగబాబు, బండి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యం : వైసిపి నేత కుంచే రమణారావు

**అమలాపురం, (రాజధాని వార్తలు):** విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యని విద్య ద్వారానే ఆర్థిక అసమానతలు తొలగుతాయని విద్యకు పేదరికం అడ్డుకాదని ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు అన్నారు. కాట్రేనికోన మండలం కాట్రేనికోన పంచాయతీ రామస్వామితోటకు చెందిన నల్లా దినేష్ కుమార్ కుమారుడు నల్లా వీర మనోహర్ ఆరవ తరగతి కాట్రేనికోన శ్రీవాణి కాన్వెంట్ లో చదువుతున్నాడు. చదువు కొనసాగించేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతుండగా విషయం తెలుసుకున్న రమణారావు వీర మనోహర్ చదువు కొనసాగించేందుకు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం అమలాపురం గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయం లో వీర మనోహర్ చదువు కొనసాగించేందుకు రమణారావు రూ. 15 వేలు చెక్కును తల్లి నల్లా మహాలక్ష్మికి ఇచ్చారు. ఆర్థిక సాయం అందజేసారు. చదువును ప్రోత్సహిస్తున్న రమణారావుకు ఈ సందర్భంగా వీర మనోహర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సిపి నాయకులు పినిపే జయరాజ్, నక్కా సంపత్, సరెళ్ల రామకృష్ణ, అంజి తదితరులు పాల్గొన్నారు.




# వి పి ఆర్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు జిల్లా ప్రజలకు ఒక వరం

### - రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆదివారం ఉదయం నెల్లూరు కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్లో వి పి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లు పంపిణీ కార్యక్రమానికి మంత్రి నారాయణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. మంత్రి నారాయణకు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం దివ్యాంగులకు ట్రై సైకిళ్లను ప్రజా ప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ 85 మంది దివ్యాంగులకు ఉచితంగా ట్రై సైకిల్ అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా వెయ్యికి పైగా ట్రై సైకిళ్లను వి పి ఆర్ ఫౌండేషన్ ద్వారా అందించడం దివ్యాంగుల పట్ల వారి సేవాభావానికి నిదర్శనంగా చెప్పారు. రాజకీయాల్లోకి రాకముందే వేమిరెడ్డి దంపతులు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని, ఇది అరుదైన విషయమని మంత్రి కొనియాడారు. రాజకీయాల్లో కూడా డబ్బులు సంపాదన కోసం రాలేదని కేవలం ప్రజలకు మరింత దగ్గరగా సేవలు అందించడమే లక్ష్యంగా వచ్చినట్లు చెప్పారు. వేమిరెడ్డి లాంటి పార్లమెంటు సభ్యులు తన నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. వేమిరెడ్డి సహకారంతో 53,54 డివిజన్ ప్రజల కోసం షాదీ మహల్ పనులను మొదలుపెట్టినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు వేమిరెడ్డి తో కలిసి నెల్లూరు నగరాన్ని మోడల్ సిటీగా అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి నారాయణ స్పష్టం చేశారు. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ తాము రాజకీయాల్లోకి రాకముందు నుంచే సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. విపిఆర్ విద్య, విపిఆర్ వైద్యం, విపిఆర్ నేత్ర, అమృత ధార వంటి అనేక సేవా కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా చేపడుతున్నట్లు చెప్పారు. పేద ప్రజలకు తమ వంతుగా మంచి చేయాలని లక్ష్యంతో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, బల్లి కల్యాణ్ చక్రవర్తి, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# వసతి గృహాలను తనిఖీ చేసిన ఆర్డీవో

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మండలం దివిలి, చంద్రమంపల్లి గ్రామాల్లో ఉన్న బీసీ వెల్ఫేర్ పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహం, బీసీ వెల్ఫేర్ పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహం, ట్రైబల్ వెల్ఫేర్ పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహం, ట్రైబల్ వెల్ఫేర్ పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహాలను పెద్దాపురం రెవెన్యూ డివిజినల్ అధికారి కె శ్రీ రమణి పెద్దాపురం ఎన్ఆర్డీతో కలిసి శనివారం పరిశీలించారు.

వసతి గృహాలలో ఉండే విద్యార్థులతో ఆర్డీఓ మాట్లాడి, అక్కడి ఆహారం, నీటి సరఫరా, పరిశుభ్రత,ఇతర అవసరమైన సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు సమగ్రంగా అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆర్డీఓ ఆదేశించారు. విద్యార్థులకు ఇంకా మెరుగైన సదుపాయాల కోసం తక్షణ చర్యలు తీసుకుంటా మని ఆర్డీఓ హామీ ఇచ్చారు. ఈ తనిఖీల్లో రెవెన్యూ, సోషల్ వెల్ఫేర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan